




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 361, పేజీలు - 08

ఆదివారం, జూన్ 21, 2026 వెల: 5 రూ/.


హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







# కారు స్పీడు తగ్గిందా.?




**- జోరందుకోని బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు - క్యాడర్ బలం ఎంత? నేతల నిర్లక్ష్యం ఉందా?**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారత్ రాష్ట్ర సమితి అధినేత కె. చంద్రశేఖర్ రావు ఇటీవల తన ఎర్రవెల్లి నివాసంలో సుదీర్ఘ సమీక్ష నిర్వహించి, ప్రతిష్టాత్మకమైన డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గత పదేళ్ల పాటు తిరుగులేని అధికార పీఠంపై ఉన్న గులాబీ పార్టీ, ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న తరుణంలో జరుగుతున్న ఈ మొదటి భారీ సభ్యత్వ నమోదు ప్రక్రియ కావడం వల్ల రాజకీయ వర్గాల్లో దీనిపై ఆసక్తి నెలకొంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కీలక నేత హరీష్ రావు వంటి అగ్రనాయకులు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ మన బలం – మన బలగం పేరుతో క్యాడర్‌లో జోష్ నింపే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, ఈ సారి సభ్యత్వ నమోదు అనుకున్న స్థాయిలో ఊపు అందుకోకపోవడం వెనుక పార్టీ అంతర్గత సమీకరణాలు, మారిన రాజకీయ ముఖచిత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**అధికారం లేనప్పుడు జోరు తగ్గడం సహజమే**

ఏదైనా ఒక రాజకీయ పార్టీకి అధికారంలో ఉన్నప్పుడు సభ్యత్వ నమోదు చేయడం చాలా సులభమైన ప్రక్రియ. ఎందుకంటే ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, స్థానిక కాంట్రాక్టర్లు, లబ్ది పొందాలని చూసే వివిధ వర్గాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రికార్డు స్థాయి సంఖ్యలో సభ్యత్వాలు చేయిస్తారు. కానీ, అధికారం లేనప్పుడు వచ్చే సభ్యత్వాలే ఆ పార్టీ నిజమైన క్యాడర్ బలాన్ని చూపిస్తాయి. ప్రస్తుతం బీఆర్ఎస్ ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు కూడా ఇదే. గతంలో 60 లక్షలకు పైగా సభ్యత్వాలు ఉన్నాయని చెప్పుకున్న బీఆర్ఎస్, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న తరుణంలో

2లో..

## పీఎం కిసాన్ 23వ విడత
# నిధులు విడుదల

**- 9.44 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 18,880 కోట్లు జమ**
**- ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం**
**- పశ్చిమ బెంగాల్‌లోని తారకేశ్వర్ నుంచి నిధుల బదిలీ కార్యక్రమం**




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకంలో భాగంగా 23వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి, ఈ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విడత కింద దేశవ్యాప్తంగా 9.44 కోట్లకు పైగా అర్హులైన రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లోకి మొత్తం రూ. 18,880 కోట్లకు పైగా నగదు జమ అయింది. 'పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్' సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం అందింది. వ్యవసాయ

2లో..

## హైదరాబాద్ మెట్రోపై
# ఢిల్లీ వేదికగా తేల్చుకుందాం

**- కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ**

**- రైల్వే మంత్రితో భేటీకి ఏర్పాట్లు చేయాలని కిషన్ రెడ్డికి విజ్ఞప్తి**
**- అధికారులు, పత్రాలతో సమావేశానికి హాజరవుతానని వెల్లడి**
**- జూన్ 22, 23 తేదీల్లో ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న ముఖ్యమంత్రి**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ నిధులు, విస్తరణ మంజూరు అంశం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో తీవ్రమైన పొలిటికల్ వార్ కు దారితీసింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జూన్ 20, 2026 నాటి అధికారిక లేఖలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి సవాల్ విసురుతూనే ఉమ్మడి పరిష్కారం కోసం ప్రతిపాదనలు పంపారు. జూన్ 22, 23 తేదీల్లో తాను దిల్లీ పర్యటనలో ఉంటానని, ఈ లోపే కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఉమ్మడి

2లో..

## బండి భగీరథ్‌కు
# బిగ్ రిలీఫ్

**- పోక్సో కేసులో బెయిల్ మంజూరు చేసిన కోర్టు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గత కొన్ని రోజులుగా తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు

2లో..

# ఏపీ రైతుల ఖాతాల్లో 7000 జమ

**- అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం**

**- 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,125 కోట్లు విడుదల - కడప, కర్నూలులో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు వర్చువల్‌గా శంకుస్థాపన**
**- వ్యవసాయ స్టాళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడిన ముఖ్యమంత్రి**

**అమరావతి (ప్రశ్న న్యూస్)**రాష్ట్రంలోని అన్నదాతలకు పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ' పథకం నిధులు విడుదలయ్యాయి. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రజావేదిక సభ నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బటన్ నొక్కి 2026 ఖరీఫ్ సీజన్ కు గానూ తొలివిడత నిధులను విడుదల చేశారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అమలవుతోన్న ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 రైతు కుటుంబాల ఖాతాల్లోకి నేరుగా లబ్ధి చేకూరింది. ఇందులో 45,69,817 మంది భూ యజమాని రైతులు ఉండగా, మరో 1,16,021 మంది అటవీ హక్కుల చట్టం కింద

2లో..




# నేను హోం మంత్రిని కాదు.. అది క్రిమినల్స్ అదృష్టం

## - పవన్ కల్యాణ్ స్ట్రాంగ్ వార్నింగ్



**- క్రిమినల్‌కు కులం, మతం, ప్రాంతం ఉండవని స్పష్టం చేసిన పవన్**
**- వైసీపీ రౌడీ మూకలు, గుండాల పిచ్చి వేషాలు తమ వద్ద చెల్లవని తీవ్ర హెచ్చరిక**
**- శాంతిభద్రతల విషయంలో పోలీసుల విధుల్లో జోక్యం చేసుకోనని హామీ**

2లో..

## కోట్ల ఆస్తులు కాపాడాం..
## మాపై దుష్ప్రచారం ఆపండి

**- హైడ్రాకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారంటూ రంగనాథ్ ఆగ్రహం**
**- హైడ్రాను బద్నాం చేసేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు**
**- సిటీలో ఇప్పటి వరకు 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని వెల్లడి**
**- తమకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదన్న రంగనాథ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ లో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న 'హైడ్రా'పై గత కొన్ని రోజులుగా వ్యతిరేక ప్రచారం జరుగుతోందంటూ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా స్పందించారు. కొందరు పనిగట్టుకుని తమ

2లో..

## పవన్ కల్యాణ్ కేవలం
## ఎంటర్‌టైనర్ ఫ్యాక్టర్ మాత్రమే

**- తెలంగాణ సెక్రటేరియట్ వైపు చూస్తే ఊరుకోం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు తెలంగాణలో ఏం పని అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి అని చెప్పుకొచ్చారు. తెలంగాణలో పవన్ కల్యాణ్ సినిమాలు చూసి సంతోషిస్తాం కానీ రాజకీయం చేస్తామంటే సహించేది లేదు అని కవిత హెచ్చరించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏపీలో రాజకీయాలు

2లో..

## కాంగ్రెస్ నేతల
## కాలర్ పట్టుకోండి

**- ఆత్మహత్యలు చేసుకోవద్దని రైతులకు కేటీఆర్ సూచన!**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వ్యవసాయం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని ఆయినా రైతులు ధైర్యం కోల్పోవద్దని కాంగ్రెస్ నేతల కాలర్లు పట్టుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిలాబాద్‌లో పిలుపునిచ్చారు. పండించిన జొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఆదిలాబాద్ జిల్లా, సిరికొండ మండలం పొన్న గ్రామానికి చెందిన ఆదర్శ రైతు పాండురంగ కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.3,720 వస్తుందని ఆశించి నెల రోజుల పాటు మార్కెట్ యార్డ్‌లోనే జొన్నల కుప్ప వద్ద పాండురంగ పడిగాపులు కాశారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ ఆఖరికి క్వింటాల్‌కు రూ.50 లంచం అడిగే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో విసిగిపోయి తన పంట కుప్పపైనే పాండురంగ విషం తాగి చనిపోవడం రాష్ట్ర వ్యవసాయ దుస్థితికి అద్దం పడుతోందని

2లో..

# అడ్డుగా ఉన్నాడు చంపెయ్

**- ప్రియుడి మోజులో పడి తల్లి కిరాతకం**

**- నుంచి ఉపాధికోసం వచ్చిన భార్యాభర్తలు**
**- పెళ్లికి ముందు నుంచి ఓ యువకుడితో సంబంధం**
**- మే నెల 29న రెండేళ్ల కొడుకును కొట్టి చంపిన మహిళ**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రియుడితో గడపడానికి అడ్డుగా ఉన్నాడని కన్నబిడ్డ ప్రాణాలు తీసింది ఓ మహిళ. ఏడుస్తూ తమ ఏకాంతానికి భంగం కలిగిస్తున్నాడని, చంపేద్దామని ప్రియుడు చెప్పిన మాటలు విని నేలకేసి కొట్టి అత్యంత కిరాతకంగా వ్యవహరించింది. కొడుకు ఫిట్స్ వచ్చి చనిపోయాడని తర్వాత భర్తకు కట్టుకథ చెప్పి నమ్మించింది. కానీ, ఆమె ప్రవర్తన తేడాగా ఉండటం గమనించి భర్త పెద్దల ముందు పంచాయతీ పెట్టించడంతో గుట్టురట్టయ్యింది. తల్లి అనే పదానికి తలవంపులు తెచ్చిన ఈ దారుణమైన ఘటన మేడ్చల్ జిల్లా కీసరలో గత నెలలో చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

2లో..

## కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి

**- తెలంగాణ 'సర్' ప్రక్రియపై ఎస్ఈవో సుదర్శన్‌రెడ్డి**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ఓటర్లకు, యువతకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఎస్ఈవో) సుదర్శన్ రెడ్డి చెక్ పెట్టారు. ఓటరు జాబితా ప్రక్షాళన కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియపై హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు. సుదర్శన్ రెడ్డి తెలిపిన వివరాల

2లో..

# కారు స్పీడు తగ్గిందా.?

ఎంతమంది తమతో నడుస్తారనే నిఖార్సయిన పరీక్షను ఎదుర్కొంటోంది. పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేసిన కోర్ క్యాడర్ ఇప్పటికీ బలంగానే ఉన్నప్పటికీ, కేవలం అధికార లాభాల కోసం చేరిన వలస శ్రేణులు ఇప్పుడు దూరం కావడం సభ్యత్వ నమోదు వేగాన్ని తగ్గించింది.

## ద్వితీయ శ్రేణి నేతల నిర్లక్ష్యం

ఈ మందగమనానికి క్యాడర్ నిర్వేదం ఒక కారణమైతే, ద్వితీయ శ్రేణి నేతల నిర్లక్ష్యం , స్తబ్దత అంతకంటే పెద్ద కారణంగా కనిపిస్తోంది. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత చాలా మంది నియోజకవర్గ స్థాయి ఇన్‌ఛార్జ్‌లు, మాజీ ఎమ్మెల్యేలు రాజకీయంగా స్తబ్దుగా మారిపోయారు. కొందరు పార్టీ మారుతారనే ప్రచారం జరుగుతుండగా, మరికొందరు సొంత వ్యాపారాల్లో బిజీ అయ్యారు. డిజిటల్ విధానంలో సభ్యత్వ నమోదు చేయాలంటే పోలింగ్ బూత్ స్థాయి కమిటీలు చురుగ్గా పని చేయాలి, కానీ నాయకులు గ్రౌండ్ లెవెల్‌కు వెళ్లి క్యాడర్‌ను సమన్వయం చేయడంలో ఆశించిన స్థాయిలో చొరవ చూపడం లేదన్నది లోకల్ టాక్. నాయకుడే యాక్టివ్‌గా లేనప్పుడు, కార్యకర్తల్లో ఉత్సాహం తగ్గడం సహజం. ఈ నాయకత్వ లోపమే సభ్యత్వ నమోదు అనుకున్న వేగంతో సాగకపోవడానికి ప్రధాన అడ్డంకిగా మారింది.

## బోగస్ సభ్యత్వాలు వద్దనుకుంటున్న బీఆర్ఎస్

బీఆర్ఎస్ అధినాయకత్వం ఈ సమస్యలను గుర్తించి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. సాంప్రదాయ పేపర్ పద్ధతి కాకుండా ఈసారి పూర్తి డిజిటల్ మోడ్ ను ఎంచుకోవడం ద్వారా బోగస్ సభ్యత్వాలకు అడ్డుకట్ట వేయాలని చూస్తోంది. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ఇద్దరు చొప్పున రాష్ట్రవ్యాప్తంగా సుమారు 71,000 మందికి పైగా కార్యకర్తలకు డిజిటల్ ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. కేటీఆర్ సైతం క్షేత్రస్థాయి చిట్‌-చాట్లలో చెబుతున్నట్లుగా.. మాకు ఓట్లు వేసిన 39 శాతం మంది ప్రజల మద్దతు అలాగే ఉంది, ప్రభుత్వ వైఫల్యాలపై క్యాడర్ పోరాడితే సభ్యత్వాలు అవే వస్తాయి అనే ధీమాతో లీడర్లను పరుగులు పెట్టించే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీల వైపు క్యాడర్ డైవర్ట్ కాకుండా కట్టడి చేయడానికే ఈ డ్రైవ్‌ను అస్త్రంగా వాడుకుంటున్నారు.ట

## ప్రజా వ్యతిరేకతను అనుకూలంగా మల్చుకునే ప్రయత్నం

బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు అనుకున్న విధంగా సాగడం లేదనేది వాస్తవమే అయినప్పటికీ, ఇది పూర్తిగా క్యాడర్ బలహీనత కాదు.. క్షేత్రస్థాయి లీడర్ల సమన్వయ లోపం. ఒక ప్రాంతీయ పార్టీ అధికారంలో లేనప్పుడు క్యాడర్ నమ్మకాన్ని గెలవడానికి కొంత సమయం పడుతుంది. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి , కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనపై పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతను, స్థానిక సంస్థల ఎన్నికలను బీఆర్ఎస్ ఏ మేరకు క్యాష్ చేసుకుంటుందనే దానిపైనే ఈ సభ్యత్వాల సంఖ్య ఆధారపడి ఉంటుంది. గులాబీ శ్రేణుల్లో ఎంతవరకు నమ్మకం కలిగించి, నాయకులను క్షేత్రస్థాయికి పంపించగలరు అనే దానిపైనే కేసీఆర్ మార్క్ రీ-ఆర్గనైజేషన్ సక్సెస్ ఆధారపడి ఉంటుంది.

# పీఎం కిసాన్ 23వ విడత నిధులు విడుదల

పనులతో పాటు ఇతర కుటుంబ అవసరాలకు ఈ మొత్తం రైతులకు సకాలంలో అండగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ. 6,000 చొప్పున మూడు విడతల్లో ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. తాజా విడుదలతో కలిపి ఈ పథకం కింద ఇప్పటివరకు రూ. 4.46 లక్షల కోట్లకు పైగా నిధులను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.ఈ విడతలో పశ్చిమ బెంగాల్‌లోని 45.35 లక్షల మంది రైతులకు రూ. 907 కోట్లు, గుజరాత్‌లోని 51.28 లక్షల మంది రైతులకు రూ. 1,025 కోట్లు అందాయి. దేశవ్యాప్త లబ్ధిదారులలో 2.18 కోట్లకు పైగా మహిళా రైతులు ఉండటం గమనార్హం. పథకం ప్రయోజనాలను సక్రమంగా పొందేందుకు రైతులు తమ ఈ-కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. లబ్ధిదారులు తమ పేరును జాబితాలో తనిఖీ చేసుకునేందుకు అధికారిక వెబ్‌సైట్‌లోని 'ఫార్మర్స్ కార్నర్'ను సందర్శించవచ్చు.

# పీఎం కిసాన్ 23వ విడత నిధులు విడుదల

సాగు చేస్తోన్న గిరిజన రైతు కుటుంబాలు ఉన్నారు.

## తొలి విడతగా ఒక్కొక్కరికీ రూ.7 వేల సాయం

ఈ పథకం కింద అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు విడతల్లో అందజేస్తున్నాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.14 వేలు కాగా, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద రూ.6 వేలు సమకూరుస్తోంది. ఈ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి విడతలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్రం పీఎం కిసాన్ కింద రూ.2 వేలు కలిపి మొత్తం రూ.7 వేల చొప్పున రూ.3,125.47 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ మొత్తం నిధులలో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2,342.92 కోట్లు కాగా, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.782.55 కోట్లుగా ఉంది. గత ఏడాది కూడా ఈ పథకం కింద ప్రభుత్వం మొత్తం రూ.8,985.41 కోట్లను రైతులకు పంపిణీ చేసిన విషయం తెలిసిందే.

## స్టాళ్ల పరిశీలన.. వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు శంకుస్థాపన

లింగంగుంట్ల ప్రజావేదిక సభ వద్ద వ్యవసాయ, ఉద్యాన శాఖలు ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శన స్టాళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆసక్తిగా పరిశీలించారు. రైతులు, మహిళా సంఘాల నేతృత్వంలో ఏర్పాటైన ప్రాసెసింగ్ ప్లాంట్లు, వర్మీకంపోస్టు తయారీ విధానాలను అడిగి తెలుసుకున్నారు.

జాతీయ నూనె గింజలు, ఆయిల్ పామ్ మిషన్, వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు సంబంధించిన ప్రదర్శనలను తిలకించారు. అనంతరం 'స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా కడప, కర్నూలు ప్రాంతాల్లో నిర్మించనున్న 'వేస్ట్ టూ ఎనర్జీ' ప్లాంట్లకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్లాంట్లు 2026 డిసెంబరు నాటికల్లా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చి పనిచేయటం ప్రారంభిస్తాయని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు.

## ప్రధాని మోదీ కార్యక్రమం వీక్షణ

పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా దేశ రాజధానిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సభకు విచ్చేసిన వేలాది మంది రైతులతో కలిసి వీక్షించారు. ఈ అట్టహాసంగా జరిగిన అన్నదాత సుఖీభవ ప్రజావేదిక సభలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, స్థానిక శాసనసభ్యులు పత్తిపాటి పుల్లారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రముఖ నేతలు, భారీ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# కోట్ల ఆస్తులు కాపాడాం.. మాపై దుష్ప్రచారం ఆపండి

సంస్థను బద్నాం చేయడానికి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈరోజు హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన హైడ్రా యాక్షన్ ప్లాన్, ఇప్పటివరకు సాధించిన విజయాలపై పక్కా లెక్కలతో క్లారిటీ ఇచ్చారు. హైడ్రా కేవలం కూల్చివేతలకే పరిమితం కాలేదని, ఇప్పటివరకు సిటీలో దాదాపు 600 ఆపరేషన్స్ పూర్తి చేసి, ఆక్రమణదారుల గుప్పిట్లో ఉన్న సుమారు లక్షా పదివేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను, చెరువులను, పార్కులను కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. దోపిడీకి గురికాకుండా ఉండాలనే ఆకాంక్షతోనే ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని, ఆ ఆశయాలకు అనుగుణంగానే ప్రభుత్వ ఆస్తులను రక్షిస్తున్నామని చెప్పారు.

"రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. మాకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. ఎంఐఎం అయినా, అధికార కాంగ్రెస్ అయినా మాకు ఒకటే. ఫాతిమా కాలేజీ లాంటి విద్యాసంస్థలు భాగ్యనగరంలో చాలా ఉన్నాయి. చట్టం అందరికీ సమానమే. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదు. అలాగని రాత్రికి రాత్రి వచ్చి ఇళ్లను కూల్చేస్తుందనేది అవాస్తవం" అని స్పష్టం చేశారు. గుడిసెలు వేసుకున్న వారిలో నిజమైన పేదలు ఎవరు అనేది పరిశీలిస్తామని, వారికి ప్రభుత్వం తరఫున డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని మానవీయ కోణంలో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలం అయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆక్రమణల వల్లే నాలాలు పూడిపోయి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. "లక్ష మంది ప్రజలకు మంచి చేయాలన్నప్పుడు.. కొంతమంది ఆక్రమణదారులకు చెడు జరగక తప్పదు. ఒకవేళ హైడ్రా వైపు ఏమైనా తప్పు ఉంటే క్షమాపణ చెప్పడానికి కూడా సిద్ధమే. తప్పులు జరిగితే సరిదిద్దుకుంటూ ముందుకెళతాం. హైడ్రా పొలిటికల్ సెటిల్‌మెంట్లకు అడ్డాగా మాత్రం మారదు" అని తేల్చిచెప్పారు.

# హైదరాబాద్ మెట్రోపై ఢిల్లీ వేదికగా తేల్చుకుందాం

సమావేశాన్ని ఏర్పాటు చేయాలని లేఖలో కోరారు.

**ఢిల్లీ మీటింగ్‌కు డిమాండ్!** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంపిన తాజా లేఖలో హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 టర్మ్ లోన్ రీఫైనాన్సింగ్, మెట్రో ఫేజ్-2 మంజూరుకు సంబంధించిన పెండింగ్ అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. జూన్ 16న తాను రాసిన మునుపటి లేఖను గుర్తు చేస్తూ ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ నిధుల విడుదల ఆలస్యంపై కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. జూన్ 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలో అందుబాటులో ఉంటానని, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఇద్దరం సంయుక్తంగా కలిసి వాస్తవాలను, ఒప్పంద పత్రాలను రికార్డులపై ఉంచుదామని లేఖలో స్పష్టం చేశారు. తెలంగాణ ప్రగతికి మెట్రో ప్రాజెక్ట్ అత్యంత కీలకమని ఆయన గుర్తు చేశారు.

**రూ. 13,500 కోట్ల లోన్ నిధుల నిలిపివేత!** హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1ను ప్రైవేట్ సంస్థ ఎల్అండ్‌టీ నుండి తెలంగాణ ప్రభుత్వం రూ. 15,000 కోట్ల ప్యాకేజీతో పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా పాత అప్పులను తక్కువ వడ్డీతో రీఫైనాన్స్ చేయడానికి ఐఆర్ఎఫ్‌సీ సంస్థ రూ. 13,538.53 కోట్ల లోన్ మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద రూ. 1,461.47 కోట్లు ఎస్క్రో ఖాతాలో జమ చేయడంతో పాటు ముందస్తు ఫీజుగా రూ. 84.32 కోట్లు ఐఆర్ఎఫ్‌సీకి చెల్లించింది. అయితే, జూన్ 15, 2026 నాడే ఈ నిధుల మొదటి విడత విడుదల కావాల్సి ఉన్నా కేంద్ర ప్రభుత్వం దీనిని సాంకేతిక కారణాల నెపంతో హోల్డ్‌లో పెట్టడం తీవ్ర వివాదానికి దారితీసింది.

**నిధుల బ్లాకింగ్ వెనుక కిషన్ రెడ్డి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు!** ఈ నిధుల నిలిపివేత వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి మైలేజ్ రాకూడదనే ఉద్దేశంతోనే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తన తోటి కేబినెట్ మంత్రులపై ఒత్తిడి తెచ్చి ఐఆర్ఎఫ్‌సీ నిధులను రాకుండా అడ్డుకున్నారని రేవంత్ ఆరోపించారు. జపాన్ సంస్థ నుంచి ఐఆర్ఎఫ్‌సీకి అందిన నిధులను రాష్ట్రానికి బదిలీ చేయకుండా తొక్కిపెట్టారని మండిపడ్డారు. అయితే, దీనిపై కిషన్ రెడ్డి స్పందిస్తూ మెట్రో ఆదాయాన్ని అప్పుల చెల్లింపుల కంటే ముందుగా ఆపరేషన్స్ కు వాడాలనే నిబంధనల వల్లే ఆలస్యమవుతోందని, ఇందులో ఎలాంటి రాజకీయం లేదని కౌంటర్ ఇచ్చారు.

**నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ ఇస్తే 100% మేమే కడతాం** రూ. 38,595 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే 122.9 కిలోమీటర్ల మెట్రో ఫేజ్-2 విస్తరణపై కేంద్రం లూప్‌హోల్స్ వెతకడంపై రేవంత్ రెడ్డి మరింత దూకుడు పెంచారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం 50:50 భాగస్వామ్యానికి సిద్ధంగా లేకపోతే స్పష్టంగా 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్' ఇవ్వాలని, తామే సొంత వనరులతో 100% నిధులను భరించి ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని సవాల్ విసిరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి పూచీకత్తులు లేకుండా పీఎఫ్‌సీ, ఆర్ఎఫ్‌సీల ద్వారా రూ. 3.15 లక్షల కోట్ల అప్పులకు అనుమతులిచ్చిన కేంద్రం.. ఇప్పుడు తక్కువ వడ్డీకి వచ్చే మెట్రో లోన్‌ను ఎందుకు అడ్డుకుంటోందని ప్రశ్నిస్తూ పొలిటికల్ మైలేజ్ సాధించే వ్యూహంలో కాంగ్రెస్ ఉంది.

**ఢిల్లీ వేదికగా తేలనున్న మెట్రో భవిష్యత్తు!** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాసిన తాజా అధికారిక లేఖ కిషన్ రెడ్డిని, బీజేపీ కూటమిని ఒక రకమైన డిఫెన్స్‌లోకి నెట్టింది. కేంద్ర మంత్రిగా ఉంటూ తెలంగాణకు వచ్చే నిధులను అడ్డుకుంటున్నారనే ముద్ర పడకుండా కిషన్ రెడ్డి ఈ జాయింట్ మీటింగ్‌కు చొరవ చూపించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# బండి భగీరథ్‌కు బిగ్ రిలీఫ్

శనివారం కీలక తీర్పును వెలువరించింది. బండి భగీరథ్ తరఫు న్యాయవాదులు దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం అతనికి షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నెల రోజులకు పైగా జైల్లో ఉన్న బండి భరీరథ్ జైలు నుంచి విడుదల కానున్నారు.ఒక మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో భగీరథ్‌పై కఠినమైన పోక్సో కేసు నమోదైన సంగతి తెలిసిందే. కేంద్ర మంత్రి కొడుకు కావడం, పైగా సున్నితమైన కేసు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ అంశం పెద్ద చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజులు అజ్ఞాతంలోకి వెళ్లిన భగీరథ్ మే 17న పోలీసుల ముందుకు వచ్చి సరెండర్ అయ్యాడు. ఆ తర్వాత మేడ్చల్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు తరలించారు. బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురవడంతో నెల రోజులకు పైగా జైల్లోనే గడపాల్సి వచ్చింది. తాజాగా ఇంజినీరింగ్ పరీక్షల నేపథ్యంలో, భగీరథ్ కు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో, భగీరథ్ జైలు నుంచి బయటకు రానున్నారు.

# నేను హోం మంత్రిని కాదు.. అది క్రిమినల్స్ అదృష్టం

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని, నేరస్తులకు కులం, మతం, ప్రాంతం వంటివి అంటగట్టి వెనకేసుకొచ్చే సంస్కృతికి చరమగీతం పాడతామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నేరాలకు పాల్పడింది తన పార్టీ నాయకులైనా సరే ఉపేక్షించేది లేదని, పోలీసుల విధుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోనని హామీ ఇచ్చారు. కాకినాడలో జరిగిన 'మన ఊరు - మాట మంతి' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్ల పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, క్రిమినల్స్‌ను ప్రోత్సహించారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ముఖ్యంగా వైసీపీకి చెందిన రౌడీ మూకలను, గుండాలను తొక్కి నార తీస్తాను అంటూ తీవ్ర పదజాలంతో హెచ్చరించారు.

## వైసీపీ గుండాలకు బహిరంగ హెచ్చరిక

"రక్తపాతం సృష్టిస్తాం, కుత్తుకలు కోస్తాం అని విర్రవీగుతున్న ప్రతి వైసీపీ గుండాకు కెమెరా సాక్షిగా చెబుతున్నా. మీ పిచ్చి వేషాలు మా దగ్గర చెల్లవు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి. ప్రజల చేతిలో నిర్ణయం ఉంటుంది. ఒకవేళ మీ ప్రభుత్వమే వచ్చినా సరే, మిమ్మల్ని తొక్కి నార తీస్తాను, గుర్తుపెట్టుకోండి. గతంలో వైసపీకి పనిచేశామని ఇప్పటికీ విధేయత చూపిస్తున్న కొందరు అధికారులపై ప్రత్యేక దృష్టి పెడతాను" అని పవన్ తీవ్రంగా హెచ్చరించారు."దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చాను. పదవుల కోసం కాదు. కాకినాడలో ఛార్జ్ తీసుకున్న తర్వాత ఎవరు ఎస్పీగా, కలెక్టర్‌గా ఉండాలో నేను నిర్దేశించలేదు. వ్యవస్థలను బలోపేతం చేయండి, నా నుంచి ఒక్క ఫోన్ కాల్ కూడా రాదని వారికి చెప్పాను. నా పార్టీ వాళ్లను పట్టుకున్నా వదలమని చెప్పను. ఎమ్మెల్సీ తన డ్రైవర్‌ను చంపేస్తే జైలుకు వెళ్లి అభినందించే వ్యక్తిని నేను కాదు. తెలిసి తెలియని వయసులో 23 నేరాలు చేసిన వాడ్ని కూడా పసిపిల్లవాడని వెనకేసుకొచ్చే నాయకుడిని కాదు" అని పవన్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి నేరపూరిత భావజాలాన్ని ప్రోత్సహిస్తే భవిష్యత్తు ఊహకు అందకుండా తయారవుతుందని ప్రజలను హెచ్చరించారు.

## శాంతిభద్రతల పునరుద్ధరణే లక్ష్యం

శాంతిభద్రతలు పటిష్టంగా ఉంటేనే పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు వస్తాయని, సమాజం సవ్యంగా ముందుకు సాగుతుందని పవన్ కల్యాణ్ అన్నారు.

"లా అండ్ ఆర్డర్ అనేది కేవలం ప్రభుత్వ విధి మాత్రమే కాదు, నాగరిక సమాజానికి అది పునాది. అది లేకపోతే సంక్షేమం, ఉద్యోగాలు, వ్యాపారాలు అన్నీ కుప్పకూలిపోతాయి. రూల్ ఆఫ్ లాను బలంగా నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులదే. ఏ విషయంలోనైనా ఒత్తిడి తీసుకువచ్చేలా నా నుంచి ఒక్క ఫోన్ కాల్ కూడా రాదు" అని ఎస్పీ, కలెక్టర్లను ఉద్దేశించి అన్నారు.

## క్రిమినల్స్‌కు కులం రంగు పులమొద్దు

కొందరు నేరస్తులకు కులం రంగు పులిమి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని, ఇది రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరమని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఆంధ్రప్రదేశ్‌కు పట్టిన కులం దరిద్రం వదిలితే తప్ప రాష్ట్రం బాగుపడదు. క్రిమినల్‌కు కులం ఉండదు. అత్యాచారం చేసేవాడికి, దోపిడీ చేసే నీచుడికి కులం ఎందుకు ఉంటుంది? అలాంటి వారిని వెనకేసుకొస్తే అది ఆ వ్యక్తి నైజాన్ని తెలుపుతుంది. ఎమ్మెల్సీ అనంతబాబు ఒక దళిత డ్రైవర్‌ను హత్య చేస్తే, అది కాపులందరికీ చెడ్డపేరు అవుతుందా? ప్రతిదానికీ కులాన్ని లాగడం సరికాదు" అని ఆయన ప్రశ్నించారు. సుగాలి ప్రీతి, వివేకానంద రెడ్డి హత్య కేసుల్లో గత ప్రభుత్వం సాక్ష్యాలను నాశనం చేయడం వల్లే నేరస్తులకు శిక్ష పడటం కష్టమవుతోందని అన్నారు.

## తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసులపై కఠినంగా ఉండాలి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారని పవన్ విమర్శించారు. "నిజమైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఎంత బలంగా ఎదుర్కొంటామో, తప్పుడు కేసులను కూడా అంతే బలంగా నిలువరించాలి. బాబాసాహెబ్ అంబేద్కర్ మీద గౌరవం ఉన్నవారెవరూ తప్పుడు కేసులు పెట్టరు. సుప్రీంకోర్టు కూడా దీనిపై స్పందించిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మా కూటమి నాయకులు కూడా ఇలాంటి వాటిని ప్రోత్సహించవద్దు" అని విజ్ఞప్తి చేశారు.

## పౌర సమాజం మేల్కొనాలి

ప్రజలు కూడా తమ బాధ్యతను గుర్తించాలని, తమ ప్రాంతాల్లో జరిగే అన్యాయాలపై గొంతెత్తాలని పవన్ పిలుపునిచ్చారు. "కుల సంఘాలకు వాట్సాప్ గ్రూపులు ఉన్నప్పుడు, శాంతిభద్రతల కోసం ఎందుకు లేవు? మీ వీధిలో 30-40 మంది కలిసి ఒక గ్రూప్‌గా ఏర్పడండి. సిటిజన్ కౌన్సిల్స్ ఏర్పాటు చేసుకోండి.

మీరు బలంగా నిలబడితే, ఏ క్రిమినల్ కూడా తలెత్తడానికి భయపడతాడు. జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా లా అండ్ ఆర్డర్ సమస్యలపై ఎక్కడికక్కడ గొంతెత్తాలి. నన్ను కులానికి పరిమితం చేయొద్దు" అని చేతులెత్తి నమస్కరిస్తూ కోరారు. వ్యవస్థాగత వైఫల్యం వల్లే ఒక ఎస్పై పరిష్కరించాల్సిన సమస్య డిప్యూటీ సీఎం వద్దకు వస్తోందని, ఇలాంటి పరిస్థితులను మార్చడానికే తాను కట్టుబడి ఉన్నానని పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు.

# కాంగ్రెస్ నేతల కాలర్ పట్టుకోండి

తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లు రూ.500 బోనస్ ఇవ్వకపోగా, ప్రైవేటు మార్కెట్లో రూ.2,000కే అమ్ముకునే దయనీయ పరిస్థితిని ఈ ప్రభుత్వం తీసుకువచ్చిందని మండిపడ్డారు.రాష్ట్రంలో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని కేటీఆర్ విమర్శించారు. పాండురంగ కుటుంబానికి ఉన్న రూ.లక్షన్నర రుణంలో ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదని ఆయన భార్య కన్నీరుమున్నీరుగా విలపించారని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం మూడు సార్లు రైతుబంధును ఎగ్గొట్టిందని, కనీసం రైతు బీమా ప్రీమియం కూడా కట్టకపోవడం వల్ల దాదాపు 7వేల క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాండురంగ బాధిత కుటుంబానికి అండగా నిలబడాలన్న ఉద్దేశంతో బీఆర్ఎస్ పార్టీ తరఫున రూ.3లక్షల ఆర్థిక సాయం అందజేశామని తెలిపిన కేటీఆర్, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే చదువుకుంటున్న ఆయన ముగ్గురు పిల్లల బాధ్యతను ప్రభుత్వమే తీసుకుని, వారికి ప్రత్యేకంగా ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని స్పష్టం చేశారు.రైతులెవరూ ఆత్మహత్యలు చేసుకుని తమ కుటుంబాలను అనాథలను చేయవద్దని, ధైర్యంగా పోరాడాలని కేటీఆర్ రాష్ట్ర రైతులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం పంటలు కొనకపోతే నాయకుల కాళ్లు పట్టుకోవద్దని, వాళ్ళ కాలర్ పట్టుకుని నిలదీయాలని, రోడ్డెక్కకుండా కాంగ్రెస్ నాయకుల ఇళ్ల ముందు కూర్చొని తమ హక్కుల కోసం ప్రశ్నించాలని సూచించారు. రైతులకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రెండేళ్లలో మళ్ళీ కేసీఆర్ వస్తారని ఆయన భరోసా ఇచ్చారు. వ్యవసాయ వ్యతిరేక విధానాలతో రైతుల ఉసురు తీసుకుంటున్న ఈ మరణాలు ఆత్మహత్యలు కావని, ఇవి ముమ్మాటికీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేయించిన ప్రభుత్వ హత్యలేనని కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవా లక్ష్మి, పాడి కౌశిక్ రెడ్డి, డాక్టర్ సంజయ్, పార్టీ నాయకులు జాన్సన్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి

ప్రకారం ఈనెల జూన్ 25 నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ స్వయంగా రానున్నారు. వారు ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారు. ఈ వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేసి జూలై 25 లోపు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఎవరైనా కొత్తగా ఓటు హక్కు పొందాలనుకుంటే అదే ఫారంలో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు.ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఉండేందుకు ఇప్పటికే మ్యాపింగ్ వేగంగా సాగుతోంది. చాలా ప్రాంతాల్లో ఇప్పటికే 80 శాతం మ్యాపింగ్ పనులు పూర్తయ్యాయి. 2002 నాటి ఓటరు డేటాతో అనుసంధానమైన వారికి కొత్తగా ఎలాంటి ఇతర డాక్యుమెంట్లు అవసరం లేదు. వలస వచ్చిన వారు లేదా కొత్త ఓటర్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన ప్రామాణిక పత్రాలను అనుమతిస్తామని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మొత్తం డ్రైవ్ పారదర్శకంగా సాగేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించినట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి గందరగోళం లేకుండా ఉండేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతరం సమావేశాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. అన్ని ప్రక్రియలు ముగించుకుని అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని తెలిపారు.

# అడ్డుగా ఉన్నాడు చంపెయ్

పోలీసుల వెల్లడించిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌కు చెందిన జ్యోతి, స్వామి దంపతులు. వీరికి నాలుగేళ్ల కుమార్తె, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చిన ఈ కుటుంబం మేడ్చల్ జిల్లా కీసరలో ఉంటోంది. క్యాబ్ డ్రైవర్‌గా స్వామి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండగా భార్య జ్యోతి ఇంటి దగ్గర పిల్లలను చూసుకుంటోంది.అయితే, పెళ్లికి ముందు నుంచి యాదాద్రి జిల్లా మాదాపూర్‌కి చెందిన నవీన్ అనే యువకుడితో జ్యోతికి వివాహేతర సంబంధం ఉంది. వివాహం తరవాత కూడా ప్రియుడితో సంబంధం కొనసాగిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో మే 29న స్వామి విధులకు వెళ్లిపోగా ప్రియుడు నవీన్ వచ్చాడు. ఇద్దరూ ఏకాంతంగా గడుపుతున్న సమయంలో జ్యోతి రెండేళ్ల కొడుకు ఏడవడంతో తమ సరదాకు భంగం కలిగించాడని ప్రియుడికి కోపం వచ్చింది. పిల్లాడి ఏడుపు బయటకు వినిపిస్తే సమస్య అవుతుందని, వాడ్ని చంపేద్దామని జ్యోతికి చెప్పాడు. ప్రియుడు మోజులో కామంతో కళ్లు మూసుకుపోయిన జ్యోతి రెండేళ్ల చిన్నారిని నేలకేసి కొట్టి అత్యంత దారుణంగా వ్యవహరించింది.దీంతో ఆ బాలుడి అక్కడక్కడే చనిపోయాడు. జ్యోతి భర్త ఇంటికి వచ్చేసరికి కట్టుకథ అల్లింది. బాబు ఫిట్స్ వచ్చి చనిపోయాడని స్వామిని, బంధువులను నమ్మించింది. ఎవరికీ అనుమానం రాకపోవడంతో అంత్యక్రియలు జరిగిపోయాయి. కానీ, ఆ తరవాత ఆమె ప్రవర్తన తేడాగా ఉండటంతో స్వామిని అనుమానం వచ్చింది. భార్యను నిలదీస్తే ఏం లేదని బుకాయించింది. చివరకు కుటుంబసభ్యుల ముందు పంచాయితీ పెట్టించి, నిలదీయడంతో తానే కొడుకును చంపినట్టు అంగీకరించింది. చివరకు ఆమె వివాహేతర సంబంధం గుట్టుకూడా రట్టయ్యింది. పోలీసులకు భర్త ఫిర్యాదు చేయడంతో చిన్నారి మృతదేహాన్ని బయటకు తీసి పోస్ట్ మార్టం కోసం పంపారు. నిందితురాలు జ్యోతిని అదుపులోకి తీసుకున్న పోలీసులు పరారీలో ఉన్న ఆమె ప్రియుడు నవీన్ కోసం గాలిస్తున్నారు.

# పవన్ కల్యాణ్ కేవలం ఎంటర్‌టైనర్ ఫ్యాక్టర్ మాత్రమే

చేసుకుంటూ ఇక్కడ సినిమాలు తీసుకోండి. కానీ సినిమాల ముసుగులో వచ్చి రాష్ట్రాన్ని కబ్జా చేస్తారు అని కవిత ధ్వజమెత్తారు. గతంలో మన భాషను వెక్కిరించి రాష్ట్రాన్ని కబ్జా చేశారు. పవన్ కల్యాణ్ సినిమాలు చూసి ఎంజాయ్ చేద్దాం అతను అన్‌ఫిట్ నాయకుడు అని టీఆర్ఎస్ చీఫ్ కవిత మండిపడ్డారు. మా సెక్రటేరియట్ వైపు చూస్తే ఊరుకోం అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత హెచ్చరించారు.

## పవన్ కల్యాణ్‌కు తెలంగాణ రీజియన్‌కు సంబంధం లేదు

తెలంగాణ రాజకీయాలతో పవన్ కల్యాణ్‌కు సంబంధం లేదు అని టీఆర్ఎస్ చీఫ్ కవిత అన్నారు. 'తెలంగాణ పవన్ కల్యాణ్ రావొచ్చు పోవచ్చు. సినిమాలు తీసుకోవచ్చు. సినిమాలు రిలీజ్ చేసుకోవచ్చు. మీ సినిమాలు చూసి మీరు వేసే స్టెప్పులు చూసి చప్పట్లు కొడతాం'అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత చెప్పుకొచ్చారు.

'మా నైజాంలో అన్నింటికన్నా పవన్ కల్యాణ్‌కు అత్యధిక కలెక్షన్లు వస్తుంది. సినీ పరిశ్రమ బతికేదే తెలంగాణ ప్రజల వల్ల.తెలంగాణ అభిమానుల వల్ల అని' కవిత చెప్పుకొచ్చారు. 'పవన్ కల్యాణ్ ఒక సినిమా యాక్టర్. మనకు ఒక ఎంటర్ టైన్ ఫ్యాక్టర్. అక్కడి వరకు ఒకే. యువత కేవలం పవన్ కల్యాణ్‌ను ఒక నటుడిగానే చూడాలి. ఆయనకు మన రీజియన్‌కు సంబంధం లేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక డిప్యూటీ సీఎం. ఆంధ్రప్రాంతంలో అధికారంలో ఉన్నాడు. ఆంధ్రప్రాంతానికి చెందిన వ్యక్తి పవన్ కల్యాణ్'అని కవిత చెప్పుకొచ్చారు.

## సినిమాలు తీసుకోండి కానీ రాజకీయం ఏపీలో చేసుకోండి

మన తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ 11 రోజులు బాధపడ్డాడు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినందుకు 11 రోజులు అన్నం తినడం మానేశాడు'అని ఆయన స్వయంగా ప్రకటించారు అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత గుర్తు చేశారు.

ఇంట్లో ఎవరైనా చనిపోతే ఎలా ఉంటారో అలా 11 రోజుల అన్నపానీయాలుమానేశాడు అని ధ్వజమెత్తారు. తెలంగాణలోని పవన్ కల్యాణ్ అభిమానులు, యువతకు ఒక్కటే చెప్తున్నాం. పవన్ కల్యాణ్ ఇక్కడ సినిమాలు తీసుకోండి కానీ రాజకీయం మాత్రం ఏపీలో చేసుకోండి. అంతేకానీ ఇక్కడ రాజకీయాలు చేస్తామంటే కుదరదు. తెలంగాణలో తెలంగాణ ప్రజలే రాజకీయం చేయాలి'అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత చెప్పుకొచ్చారు.

## సెక్రటేరియట్ దిక్కు చూస్తే ఊరుకోం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనేది ఎంతోమంది ఆత్మబలిదానాలతో ఏర్పడింది. 1200 మంది ఉద్యమకారులు బలయ్యారు. ఈ విషయాలను ప్రస్తుత తరం యువత తెలుసుకోవాలి. తెలంగాణ ఉద్యమ సమయంలో మీరంతా చిన్న పిల్లలు కాబట్టి చరిత్ర తెలుసుకోవాలి అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత సూచించారు.

గతంలో సినిమా యాక్టర్ ముసుగులో వచ్చి తెలంగాణను కబ్జా చేశారు. తెలంగాణ యాష బాగోలేదు అని అన్నారు. యాస పేరుతో మమ్మల్ని ఏడిపించారు. తెలంగాణ యాసలో మాట్లాడకుండా చేశారు. నా ఊరు భువనగిరి, నా పేరు యాదగిరి, నేను చేసేది దాదాగిరి అంటూ డైలాగులతో తెలంగాణ ప్రజలను ఇబ్బంది పెట్టారు.మేము తెలంగాణ యాస మాట్లాడేందుకు సైతం ఇబ్బంది పెట్టేవారు'అని కవిత గుర్తు చేశారు.

ప్రస్తుతం తెలంగాణ యాష ఫ్యాషన్ అయ్యింది. ఒకప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్టులకు వాడే తెలంగాణ యాస ఇప్పుడు సినిమా హీరోలకు పెడుతున్నారు. ఇప్పుడు తెలంగాణ యాసే ట్రెండింగ్‌లో ఉంది అని కవిత చెప్పుకొచ్చారు.'పవన్ కల్యాణ్ కేవలం ఒక ఎంటర్‌టైన్ ఫ్యాక్టర్. రండి సినిమాలు చేసుకోండి. మేకప్‌లు చెప్పుకోండి, ప్యాకప్‌లు చెప్పుకోండి కానీ మా సెక్రటేరియట్ దిక్కు చూస్తే మాత్రం ఊరుకోం'అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత హెచ్చరించారు.

## ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి

**- ఎంపీ వల్లభనేని బాలశౌరి**

**మచిలీపట్నం** మచిలీపట్నం బస్టాండ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి తెలిపారు. శనివారం ఆయన ఆకస్మికంగా మచిలీపట్నం బస్టాండ్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఇటీవల బస్టాండ్ దుస్థితిపై మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో స్పందించిన ఎంపీ, వర్షాలు కురిసినప్పుడు బస్టాండ్ మొత్తం నీటమునిగిపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ ప్రాంగణంలో పేరుకుపోయిన నీరు, పారిశుద్ధ్య సమస్యలు, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌ను ఆధునీకరించి సుందరీకరించేందుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను వినియోగించేలా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఎంపీ ఆదేశించారు. ప్రయాణికులకు పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. బస్టాండ్ సముదాయాన్ని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేందుకు అవసరమైన నిధుల సమీకరణకు తాను కృషి చేస్తానని ఎంపీ వల్లభనేని బాలశౌరి హామీ ఇచ్చారు. ప్రజలకు నాణ్యమైన రవాణా సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఎంపీ పర్యటనతో బస్టాండ్ సమస్యల పరిష్కారానికి త్వరలోనే చర్యలు చేపట్టే అవకాశం ఉందని ప్రయాణికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

## కృష్ణలంక స్వర్గపురి శ్మశానవాటికలో పోలీసుల విచారణ

**విజయవాడ** కృష్ణలంక స్వర్గపురి శ్మశానవాటికలో పోలీసుల విచారణ కొనసాగింది. గత నెలలో జరిగిన గుర్తుతెలియని మృతదేహాల ఖననంపై పటమట సీఐ పవన్ కిషోర్ విచారణ చేపట్టారు. స్వర్గపురి సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. స్వర్గపురి ఎలక్ట్రిక్ ఫర్నస్ ఆపరేటర్ బాష ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. బాషా మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అనాథ మృతదేహాలను దహనం చేయడానికి ప్రొసీజర్ ఫాలో అయ్యారా లేదా అనే కోణంలో విచారణ కొనసాగింది. మృతదేహాలను ఖననం చేసే ముందు రికార్డ్ మెయింటెయిన్ చేశారా అని ప్రశ్నించారు.

## కంబదహాల్ గ్రామంలో స్వర్ణాంధ్రబిస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



**సి. బెలగల్ జూన్ 20** మండల పరిధిలోనికంభదహాల్ గ్రామంలో “స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర” కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి అశ్వినికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే ఎంపీడీఓ రాణమ్మ డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి పీడీఓ , గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్థాయి ఉద్యోగులు, జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు గ్రామంలోని హౌసింగ్ లేఔట్‌ను సందర్శించి, నిర్మాణంలో ఉన్న ఇళ్ల పురోగతిని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వేస్ట్ టు వెల్త్ సెంటర్ ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనితీరును పరిశీలించారు. గ్రామ పరిశుభ్రతను మరింత మెరుగుపరచేందుకు అవసరమైన సూచనలు చేశారు. అదేవిధంగా గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బంది మరియు గ్రామస్థాయి ఉద్యోగులతో సమావేశమై, ప్రభుత్వం చేపడుతున్న వివిధ సర్వేల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సర్వేలు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి అశ్విని కుమార్ మాట్లాడుతూ, “స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర” కార్యక్రమం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సహకారంతో ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రామ ప్రజలు కూడా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామంలో అభివృద్ధి, పరిశుభ్రత మరియు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, సమాజంలో మరింత చైతన్యాన్ని కలిగించింది. అధికారులు, సిబ్బంది, ప్రజల సమిష్టి కృషితో కంభదహాల్ గ్రామం ఆదర్శ గ్రామంగా నిలవాలని ఆకాంక్షించారు.

## మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలిద్దాం




**కరీంనగర్** మత్తు పదార్థాలు మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నార్కోటిక్ కోఆర్డినేషన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. మాదకద్రవ్యాల నియంత్రణ సమాజంలోని ప్రతి ఒక్కరి సమిష్టి బాధ్యత అని పేర్కొన్నారు. యువతను మత్తు బారిన పడకుండా కాపాడేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డ్రగ్స్ రహిత జిల్లాగా కరీంనగర్‌ను తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కల్పించడం ద్వారా యువతను సరైన మార్గంలో నడిపించవచ్చని పేర్కొన్న ఆమె, మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ. ఈ నెల 26న నిర్వహించే అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యాసంస్థల్లో విద్యార్థులకు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలకు, గ్రామ సభల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నామని, అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి విద్యార్థులతో పోస్టర్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించడం, విద్యాసంస్థలను సందర్శించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 26న ర్యాలీలు, గ్రామ సభలు, డ్రగ్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో పాన్ షాపులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను అనంతరం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు షర్మిల, జల కుమారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు నార్కోటిక్స్ ఇన్స్పెక్టర్ రఫిక్ ఖాన్ పోలీస్, ఎక్సైజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### నంద్యాల జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లు, పోలీస్ కార్యాలయాలలో
## స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహణ

- ప్రజలలో పరిశుభ్రతపై చైతన్యం తీసుకువచ్చేలా పోలీసులు సమాజానికి ఆదర్శంగా నిలవాలి
- మన ఇంటి లాగే మనం పనిచేసే చోట పరిశుభ్రమైన వాతావరణం ఏర్పాటు చేసుకోవాలి



**నంద్యాల** జిల్లా ఎస్పీ సునీల్ షెరాణ్ ఆదేశాలమేరకు పరిశుభమైన,ఆరోగ్యకరమైన వాతావరనన్నీ ఏర్పాటు చెయ్యడమే లక్షంగా నేడు నంద్యాల జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ లు పోలీస్ కార్యాలయాలలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలోని స్పెషల్ బ్రాంచ్, పాస్పోర్ట్ కార్యాలయం, సైబర్ క్రైమ్ , ఫ్యాక్షన్ జోన్ కార్యాలయాలు, సాయుధ బలగాల కార్యాలయాలు, మోటార్ వెహికల్ కార్యాలయం, మరియు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు పోలీస్ కార్యాలయాలలో జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బంది తమ కార్యాలయాలు మరియు చుట్టు పక్కల ప్రాంగణాలను సమగ్రంగా పరిశుభ్రం చేశారు. పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా మొక్కలను నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విధులు నిర్వహించే చోట వాతావరణాన్ని పరి శుభ్రంగా ఉంచుకోవడం సిబ్బంది ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మన ఇంటిని ఏ విధంగా శుభ్రంగా ఉంచుకుంటామో అదేవిధంగా పనిచేసే చోటా పరిశుభ్రమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలని తద్వారా అనారోగ్య సమస్యలు విషజ్వరాలు వ్యాప్తి చెందకుండా ఉంటాయని,ప్రజలలో పరిశుభ్రతపై చైతన్యం తీసుకొని రావడమే కాకుండా భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తూ పోలీసులు సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

**- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**



**కరీంనగర్** కరీంనగర్ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్టు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. శనివారం బెజ్జంకి మండలం దేవక్కపల్లి, పోతారం, పెరుకబండ గ్రామాల్లో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి మెరుగైన రహదారులు ఎంతో అవసరమన్నారు. ప్రజలకు రాకపోకల సౌకర్యం కల్పించడంతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ముఖ్యంగా గ్రామాల మధ్య కనెక్టివిటీ పెంచడంతో అభివృద్ధికి బాట వేయడమేనని ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో దేవక్కపల్లి గ్రామ సర్పంచ్ నేరెళ్ల వెంకటలక్ష్మి-రాజయ్య,పోతారం గ్రామ సర్పంచ్ సింగిరెడ్డి రాజేందర్ రెడ్డి,పెరుకుబండ సర్పంచ్ కర్రావుల స్వప్న, ఆయా గ్రామాల పార్టీ ధ్యక్షులు గ్రామశాఖ అధ్యక్షులు పంజాల అజయ్, కె.బాబు,కె.తిరుపతి, బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డితోపాటు పలువురు సర్పంచులు, పార్టీ గ్రామాధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**పరామర్శలు** బెజ్జంకి మండలం పాపన్నపల్లి, బెజ్జంకి ఎక్స్ రోడ్డు, గాగిల్లాపూర్ గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతులకు నివాళులర్పించడమే కాకుండా వారి కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు.

## హోంమంత్రి అనిత తన పదవికి రాజీనామా చేయాలి

**- గాదె సాయికృష్ణ తల్లికి సంఘీభావంగా తిరుపతిలో వైసీపీ భారీ ర్యాలీ**

**తిరుపతి** సాయి కృష్ణ తల్లికి సంఘీభావండా తిరుపతిలో శనివారం నాడు వైకాపా నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంత వీధి నుంచి భారీ నిరసన ర్యాలీ గాంధీ రోడ్ పూల మఠం వరకు సాగింది. భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ సాయికృష్ణ లాక్ డెత్ ఘటనపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేసారు.

కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు ఏ విధంగా ఉన్నాయో ఈరోజు ప్రతి ఒక్కరికి తెలుస్తోంది. అనంతపురం జిల్లాలో ఒక దళిత మహిళ తల్లి లాకప్ డెత్ ఘటన తరువాత ఇలాంటి ఘటనలు ఎన్నో చోట్ల జరిగాయి . కృష్ణలంక పీఎస్లో జరుగుతున్న దారుణాలకు సీఐ ఒకరే బాధ్యుడు కాదు, వెనుక ఉండి నడిపించిన ప్రతి ఒక్కరికి శిక్షపడాలని అన్నారు.

## హాఫీజ్పేట్ కో-లివింగ్ హాస్టల్లో అగ్నిప్రమాదం



**రంగారెడ్డి** హాఫీజ్ పేటలో ఒక హాస్టల్ లో అగ్ని ప్రమాదం జరిగింది. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హాఫీజ్పేట్ మార్తాండ నగర్లో ఘటన చోటు చేసుకుంది. కో-లివింగ్ హాస్టల్ భవనంలో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఘటన సమయానికి హాస్టల్ నివాసితులు బయటకు పరుగులు తీసారు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం లేదు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## ఆగస్ట్, సెప్టెంబర్లో 'స్థానిక' ఎన్నికలు

**మంత్రి మండిపల్లి** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆగస్ట్, సెప్టెంబర్లో ఎలక్షన్స్ జరుగుతాయన్నారు. ప్రచారంలో ముందుండాలని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్య కర్తలకు సూచించారు. కాగా ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే హైకోర్టుకు తెలిపింది. దీంతో 2 నెలల్లో సర్పంచ్, ఓఖుఅ ఎలక్షన్స్ జరిగే అవకాశం ఉంది.

## చిట్టీల మాస్టర్‌పై సస్పెన్షన్

**వరంగల్** బడిలో పిల్లలకు పాఠాలు చెప్పాల్సిన ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. బయల పెద్ద ఎత్తున చిట్టీల వ్యాపారం చేస్తూ అడ్డంగా బుక్కయ్యాడు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రైవేట్ ఫైనాన్స్ దందా నడిపిస్తున్న మ్యాథ్స్ టీచర్‌ను విద్యాశాఖ సస్పెండ్ చేసింది. వివరాల్లోకి వెళితే, హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో కలువల ఎల్లయ్య అనే వ్యక్తి మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్నాడు. అయితే ఈయనగారు స్కూల్ టైమింగ్స్ దాటిన తర్వాత ప్రభుత్వ రూల్స్ కి పూర్తిగా విరుద్ధంగా ప్రైవేటుగా చిట్టీల వ్యాపారం నడిపిస్తున్నాడు. ఈ క్రమంలోనే చిట్టీల డబ్బుల విషయంలో పలువురిని మోసం చేశాడంటూ ఇటీవల ఎల్లయ్యపై బాధితులు ఫిర్యాదులు చేశారు. ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ ఇలాంటి ప్రైవేట్ దందాలు చేయడంపై హనుమకొండ జిల్లా కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఈ ఆరోపణల నిగ్గు తేల్చేందుకు ఒక ప్రత్యేక విచారణ కమిటీని రంగంలోకి దించారు. ఈ కమిటీ జరిపిన ప్రాథమిక విచారణలో ఎల్లయ్య రూల్స్ బ్రేక్ చేసి చిట్టీల దందా నడిపినట్లు, మోసాలకు పాల్పడినట్లు ఆధారాలతో సహా నిజమని తేలింది. దీంతో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) గిరిరాజ్ సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## యోగా మతానికి లింక్ చేయవద్దు

**హైదరాబాద్** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ వేదికగా భారీ యోగా ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు... యోగా విశిష్టతపై అత్యంత స్పష్టమైన, కీలకమైన వ్యాఖ్యలు చేశారు. యోగాను ఒక మత కోణంలో చూసే వారిపై ఆయన తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. యోగా అనేది ఏ ఒక్క మతానికో, వర్గానికో పరిమితమైంది కాదని... దానికి మతాన్ని ఆపాదించి చూడటం ముమ్మాటికీ మూర్ఖత్వమే అవుతుందని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. “ప్రపంచానికి భారతదేశం అందించిన అత్యంత గొప్ప అమూల్యమైన కానుక యోగా. ఇది కేవలం వ్యాయామం కాదు.. మనిషిని సమగ్ర మనిషిగా మార్చే అద్భుత సాధనం. మానవ చైతన్యానికి, సర్వమానవ సౌభ్రాతృత్వానికి ఇదొక నిదర్శనం. మానసిక ఒత్తిడిని దూరం చేసి, గుండె నిబ్బరాన్ని, ఆధ్యాత్మిక స్థైర్యాన్ని ఇచ్చే ఈ జీవన విధానాన్ని మన పూర్వీకులు మనకు అందించారు. ప్రకృతి ఒడిలో జీవిస్తూ ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాటను ప్రతి ఒక్కరూ నిజం చేయాలి” అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... విశ్వవ్యాప్తంగా యోగాకు వస్తున్న గుర్తింపు మన దేశానికి గర్వకారణమన్నారు. యోగా అనేది మన ప్రాచీన సంస్కృతిలో ఒక భాగమని, నేటి ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరికీ శారీరక, ఆరోగ్య చింతన ఎంతో అవసరమని పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ... ప్రధాని మోదీ చొరవతోనే 12 సంవత్సరాల క్రితం యోగాకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించిందని, నేడు ప్రపంచ దేశాలన్నీ యోగాను అనుసరిస్తున్నాయని గుర్తు చేశారు. డిప్రెషన్ లాంటి సమస్యలను దూరం చేయడానికి యోగా అద్భుతంగా పనిచేస్తుందని, పిల్లల నుండి పెద్దల వరకు అందరూ దీనిని రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు

## గురవారెడ్డిపై అట్రాసిటీ కేసు

**హైదరాబాద్,** హైదరాబాద్‌లో వైద్యసర్కిల్‌లో ఊహించని ప్రకంపనలు మొదలయ్యాయి. ఎంతో గౌరప్రదమైన స్థానంలో ఉంటూ లక్షల మందికి సుపరిచితులైన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ గురువారెడ్డి చిక్కుల్లో పడ్డారు. ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది. తనను వేధిస్తున్నారని మరో వైద్యుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. జూబ్లీహిల్స్‌లో క్లినిక్ నడుపుతున్న డాక్టర్ సుధీర్ దారా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తన వృత్తిపరమైన ప్రతిష్టను దెబ్బతీసేలా, సమాజంలో తనకున్న గౌరవాన్ని భంగపరిచేలా డాక్టర్ సుధీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారెడ్డి, ఆయన సహచరులు సోషల్ మీడియా వేదికగా నిర్వహించారని, ఈ క్యారెక్టర్ అస్సాసినేషన్ కేవలం ఇంటర్నెట్‌కే పరిమితం కాకుండా తన ప్రాణాలకే ముప్పుగా మారిందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు తనపై దాడి చేయడానికి వచ్చారని వెల్లడించారు. డాక్టర్ సుధీర్ ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36పరిధిలో క్లినిక్ నడుపుతున్న డాక్టర్ సుధీర్, గత కొంతకాలంగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో తనపై జరుగుతున్న సైబర్ బుల్లీయింగ్ పూర్తిగా ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారెడ్డి సోషల్ మీడియాలో తనకున్న ఫాలోయింగ్‌ను ఉపయోగించుకొని, సుధీర్ దారా క్లినిక్, వ్యక్తిగత సామర్థ్యంపై తప్పుడు ఆరోపణలు గుప్పించారని, దీని వెనుక పెద్ద ప్రొఫెషనల్ రైవల్రీ ఉందని అనుమానం వ్యక్తం చేశారు

## విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలి






**సిద్దిపేట** ప్రభుత్వ విద్యా సంస్థలలో మెనూ పాటిస్తూ విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సంబంధిత అధికారులను ఆదేశించారు. కొండపాక మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, పప్పు, బెండకాయ, సాంబారు,రసం,గుడ్డులను పరిశీలిస్తూ రసం నాణ్యత మెరుగు పరచాలని పచ్చిపులుసు లాగా చెయ్యకూడదని వంట సిబ్బందిని హెచ్చరించారు. వంట గది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోజు కామన్ డైట్ మెనూ పాటిస్తూ వంట రుచికరంగా పెట్టాలని, విద్యార్థులకు చదువుతో పాటు భోజనం, వసతిలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎస్ఓ ను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏంఈఓ శ్రీనివాస్ రెడ్డి,ఎస్ఓ, తదితరులు ఉన్నారు.

# ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ వెంకటేష్, ఎస్.ఐ

## కంటోన్మెంట్ లో "8"భూమి చూట్టు గళం ఎత్తుతున్న నేతలు



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న ఎనిమిది ఎకరాల భూమి.ఇత ఇరవై రెండు సంవత్సరాలుగా సర్కార్ వర్సెస్ ప్రైవేటు వ్యక్తుల మధ్య పోరు జరుగుతోన్న విషయం అందరికి తెలిసిందే.ఈ స్థలం ఆనుకొని ఉన్న ప్రజలు, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తున్నారు.మరికొందరు అయితే ప్రభుత్వ భూమిగా ఉండాలని కోరుతున్నారు.ఈ నేపథ్యంలో రాత్రికి రాత్రే భూ బకాసురులు చెతిలోకి వెళ్లిపోవడంతో స్థానికంగా అందరూ ఆశ్చర్యపోయారు.ఒకపక్క నిజాం నవాబుకు చెందిన సీఎస్ "13"అంటూ,మరి కొందరు అయితే సీఎస్ "14"అంటూ ప్రచారంలో తనదైనశైలితో దూసుకుపోయిన విషయాన్ని గుర్తు చేశారు.ఏదేమైనా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బిఆర్ఎస్ నేతలు మాత్రం మొదటి నుంచి ప్రభుత్వానికి చెందిన "157/1 " స్థలం అని, ల్యాండ్ బ్యాంకు నెంబర్:84.గా పేర్కొంటున్నారు.ఇలా ఒకటి కాదు రెడు కాదు చాంతాడంత అనుమానాలతో కూడిన వ్యవహారం అందరికీ తెలిసిందే.అందుకే ఇదిలా సరైన విధానం కాదని తెలుసుకున్న బిఆర్ఎస్ నేతలు.గత కొంతకాలంగా హస్మత్ పేట సర్వే నెంబర్:157/1 పై పోరు బాట పట్టారు.తిరుమల గిరి మండలంలో అన్ని అవకతవకలు జరిగాయని, అందుకే అస్మదీయుల చెంతకు చేరిన విషయం గుర్తు చేశారు.ఇలా ఒకటి కాదు రెండు కాదు ఎన్ని ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేస్తారని నిన్న తిరుమల గిరి ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నాకు దిగిన బిఆర్ఎస్ నేతలు.ఇందులో ముఖ్యంగా ఉద్యమకారులు స్థానిక పెద్ద దిక్కు గజ్జెల నాగేష్ ప్రశ్నించారు."ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.కానీ నేడు దాదాపు రూ.800 కోట్ల విలువైన 157/1 ప్రభుత్వ భూమిని కబ్జాదారుల బారిన పడనివ్వడం అత్యంత సిగ్గుచేటు, బాధాకరమైన విషయం. పేదలకు చెందాల్సిన భూములను భూ మాఫియాల చేతుల్లోకి వెళ్లనివ్వడం ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే చర్య.ఈ అన్యాయాన్ని ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లేందుకు మేము వినతిపత్రం సమర్పించడానికి కార్యాలయానికి వచ్చాము. అయితే సంబంధిత అధికారి అందుబాటులో లేకపోవడం ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనం.మా డిమాండ్ చాలా స్పష్టంగా ఉంది.వెంటనే 157/1 ప్రభుత్వ భూమిపై ప్రభుత్వానికి చెందినదని స్పష్టమైన బోర్డులు ఏర్పాటు చేసి,ట్రెస్పాస్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు పూర్తి స్థాయిలో ఫెన్సింగ్ చేపట్టాలి. ఈ భూమిని భూ కబ్జాదారుల చెర నుంచి విముక్తి చేసి నిజంగా ఇళ్ల కోసం ఎదురు చూస్తున్న నిరుపేదలకు ఇండ్ల స్థలాలుగా కేటాయించాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుడతాం. మండల కార్యాలయాల ముట్టడులు, ధర్నాలు, రాస్తారోకోలు, నిరాహార దీక్షలు, ప్రజా పోరాట కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వాన్ని నిలదీస్తాం. ప్రభుత్వ భూములను పేదలకే అందించే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం నిరంతరం కొనసాగుతుంది. ఈ నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే సాయన్ననివేదిత,మాజీ బోర్డు సభ్యులు పాండు,నళిని,పిరసాని శ్యాం కుమార్, లోక్ నాథ్, అనిత ప్రభాకర్,మాజీ చైర్మన్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ భూముల పరిరక్షణకు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ 12 వేల రూపాయల విరాళం



**రుద్రవరం** మండల కేంద్రం రుద్రవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు దాతలు రూ 12 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. రుద్రవరంలోని ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసినఆర్ కొత్తపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత హెడ్మాస్టర్ దివంగతగంధం రామిరెడ్డి మనవడు ఇండియన్ పెట్రోల్ ఆయిల్ బంక్ ప్రొప్రైటర్ గంధం బ్రహ్మానందరెడ్డి కుమారుడు గంధం యశస్వి రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఉన్నత పాఠశాలలో ఉన్న మెయిన్ గేటు మరమ్మతల కోసం రూ 12 వేల నగదును ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ వెంకటరమణకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి పరిచేందుకుతమ వంతు సహాయంగా ఈ విరాళాన్ని అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన ఎల్ఐసీ నరసింహులు..!



**సి.బెళగల్, జూన్ 20:** భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, కోడుమూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మాజీ టీటీడీ పాలక మండలి సభ్యులు పరిగెల మురళీకృష్ణ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, సి.బెళగల్ మండలం గుండ్రేవుల గ్రామానికి చెందిన ఎల్ఐసీ నరసింహులు శనివారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పరిగెల మురళీకృష్ణ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరిగెల మురళీకృష్ణ మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ దేశాభివృద్ధి, జాతీయత, సుపరిపాలన లక్ష్యాలతో ముందుకు సాగుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఎల్ఐసీ నరసింహులు పార్టీ సిద్ధాంతాలు, ప్రధాని నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న తీరు, అలాగే పరిగెల మురళీకృష్ణ ప్రజాసేవా దృక్పథం తనను ఆకర్షించాయని పేర్కొన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా బీజేపీలో చేరానని, పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.అలాగే కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయడానికి పార్టీ కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి తన అనుభవాన్ని వినియోగిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రతి గుంత ఒక ప్రశ్న

# నాగారం రోడ్డుపై ప్రయాణం ప్రాణసంకటం

### చిన్నపాటి వర్షానికే చెరువులుగా మారుతున్న రోడ్లు

### నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న పాలకులు, అధికారులు





ఘట్కేసర్ ( ప్రశ్న న్యూస్) ఘట్కేసర్ సర్కిల్ నాగారం -- దమ్మాయిగూడ ప్రధాన రహదారిపై ప్రయాణమంటేనే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డంతా గుంతలమయమై, చెరువును తలపిస్తోంది. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కావడంతో ఈ మార్గంలో విద్యార్థులు, ఉద్యోగులు, మహిళల రద్దీ తీవ్రంగా పెరిగింది. మోకాళ్ల లోతు నీరు నిలవడంతో ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ రోడ్డు ఉందో తెలియక నిత్యం ద్విచక్ర వాహనదారులు కిందపడి ప్రమాదాల బారిన పడుతున్నారు.

### బాధ్యత ఎవరిది? ఎవరిని ప్రశ్నించాలి.?

రోడ్ల పరిస్థితి ఇంత ఘోరంగా ఉన్నా అటు ప్రభుత్వం, ఇటు స్థానిక ఎమ్మెల్యే, అధికారులు కనీసం పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణాలు పోయాక వచ్చి సానుభూతి ప్రకటిస్తారా?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సమస్యలు పరిష్కరించాల్సింది పోయి.. కేవలం ఫోటోలు, ఫ్లెక్సీలు, రాజకీయ ప్రచారాలకే పరిమితమవుతున్నారని మండిపడుతున్నారు.

### రోడ్డు మరమ్మతుకు ప్రజలు డిమాండ్

ప్రజలకు కావాల్సింది హామీలు, రాజకీయ ప్రసంగాలు కాదని.. సురక్షితమైన ప్రయాణమని స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు తక్షణమే స్పందించి నాగారం -- దమ్మాయిగూడ రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, లేనిపక్షంలో ప్రజల ఆగ్రహాన్ని చవిచూడక తప్పదని హెచ్చరిస్తున్నారు.

## అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



**ఆళ్లగడ్డ** పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ ఎమ్మెల్యే ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతే దేశానికి వెన్నెముక అని, రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ఎన్డీఏ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, రైతులకు పెట్టుబడి సాయం, సాగునీరు, మద్దతు ధరలు, వ్యవసాయానికి అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు తెలిపారు.రైతుల కష్టాలను అర్థం చేసుకుని వారి ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆకాంక్షించారు.

# 12వ పిఆర్సీని తక్షణం అమలు చేయాలి

### - యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ డిమాండ్..



**బద్వేలు** ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12 వ పిఆర్సీని తక్షణమే అమలు చేయాలని, పెండింగ్ బకాయిలను, డిఏలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ డిమాండ్ చేశారు.శనివారం ఉదయం ఆయన కడపకు విచ్చేసిన సందర్భంగా కడపలోని ఓంశాంతి నగర్ నందు గల హోం స్టే నందు ఆ సంఘ ముఖ్య కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కె.ఎస్.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వంపై అనేక ఆశలు పెట్టుకున్నారని, అయితే ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరుతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర నిరుత్సాహంతో ఉన్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, సమస్యలను పరిష్కరించడాన్ని విస్మరిస్తున్నారన్నారు. 12వ పిఆర్సీ గడువు ముగిసి మూడేళ్లు అవుతున్నా పిఆర్సీని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. 11వ పిఆర్సీని సైతం అప్పటి వైసిపి ప్రభుత్వం మూడున్నర ఏళ్లు ఆలస్యంగా అమలు చేయడంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులు అలాగే సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు ఉద్యోగులకు జరుగుతున్న నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం తక్షణం 12వ పిఆర్సీని ఏర్పాటు చేసి, పిఆర్సీ అమలయ్యే వరకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 29 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను కూటమి ప్రభుత్వం కొంతమేరకు చెల్లించినప్పటికీ, ఇంకా 25 వేల కోట్ల రూపాయల పైబడి బకాయిలు పేరుకపోయాయన్నారు. వీటి చెల్లింపులలో నిర్దిష్టమైన కాల వ్యవధి లేకపోవడం వల్ల పూర్తిస్థాయిలో బకాయిల చెల్లింపులు జరగడం లేదన్నారు. నాలుగు డిఏలు పెండింగ్ ఉన్నా పాలకులు కనీసం స్పందించడం లేదని విమర్శించారు. మూడు సంవత్సరాలుగా సరెండర్ లీవ్ చెల్లింపులు లేవని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు, పాత పెన్షన్ అమలు లాంటి విధానాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. 2004 కు ముందు నియామక ప్రక్రియ పూర్తయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలనే కేంద్ర ప్రభుత్వ మెమో 57 సైతం అమలుకు నోచుకోలేదన్నారు. ముఖ్యమంత్రి ఆమోదం పొందినప్పటికీ కాలయాపనలో ఆంతర్యం ఏమిటన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హెల్త్ కార్డులపై ఉద్యోగులకు వైద్యం అందడం లేదన్నారు. నగదు చెల్లించి వైద్యం పొందిన మెడికల్ బిల్లులు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆమోదం పొందినప్పటికీ వాటి చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నదని విమర్శించారు. దీనిపై కమిటీ నియమించినా ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టడంలో ప్రభుత్వ అలసత్వం సరికాదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను కారణంగా చూపి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నిర్వహించాలని కోవడం తగదన్నారు. విద్యా శాఖ మంత్రి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి విద్యాహక చట్టం 23(1) సవరణకు కృషి చేయాలని కోరారు. చట్ట సవరణ జరిగే వరకూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ పరీక్షను, ఆఫ్ లైన్ విధానంలో నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి చెప్పకపోతే పోరాటానికి సన్నద్ధమవుతామని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్, సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ క్రషర్, క్వారీ అనుమతులపై విచారణ చేయాలి

### - తహసీల్దార్‌కు చక్రవర్తి ఫిర్యాదు



**రంపచోడవరం** పోక్స్‌పేట పంచాయతీ నర్సాపురం, దిరిసినపల్లి వద్ద ఉన్న నారాయణ క్రషర్ మరియు క్వారీకి ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా లేదా అనే దానిపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ పోలవరం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చక్రవర్తి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.క్రషర్, క్వారీ నిర్వహణకు మైన్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రెవెన్యూ శాఖల నుంచి తగిన లైసెన్సులు ఉన్నాయో లేదో తనిఖీ చేసి వాస్తవాలను వెల్లడించాలని ఫిర్యాదులో కోరారు.అనుమతులు లేకుండా నిర్వహిస్తుంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని చక్రవర్తి విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు స్వీకరించి సంబంధిత అధికారులతో విచారణ చేయిస్తామని హామీ ఇచ్చారు.

# మానవతా సేవలో పోలీసు శాఖ

## "మా" అభాగ్యుల వృద్ధాశ్రమాన్ని సందర్శించిన ఎస్పీ




సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) వృద్ధులకు పండ్లు, నిత్యావసర సరుకులు పంపిణీ. గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని "మా" అభాగ్యుల వృద్ధాశ్రమాన్ని ఎస్పీ మహేష్ బి.గితే సందర్శించారు.ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు,అవసరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు,బియ్యం,కిరాణా సరుకులు, ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. సమాజంలో వృద్ధులు, నిరాశ్రయులు,అనాథల సంక్షేమం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. వృద్ధుల సేవ చేయడం గొప్ప మానవతా ధర్మమని, వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు.అవసరమైన వారికి సేవలు అందించడంలో జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.

# కీసరలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి: ఆరుగురు అరెస్ట్

## రూ. 19,320 నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం



కీసర (ప్రశ్న న్యూస్) కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని కుందన్పల్లి గ్రామ శివారులో గల ఓఆర్ఆర్ సమీపంలోని దొండతోటలో రహస్యంగా సాగుతున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు కీసర సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు.విశ్వసనీయ సమాచారంతో దాడులు నిర్వహించిన పోలీసులు.. నిందితుల నుండి రూ. 19,320 నగదు, 6 సెల్‌ఫోన్లు, 2 సెట్ల ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో నడింపల్లి రామకృష్ణ (బండ్లగూడ), మదునూరి కృష్ణంరాజు (ఘట్కేసర్), నడింపల్లి సూర్యనారాయణ (కీసర), చిలుగూరి రామరాజు (మియాపూర్), గుంటూరి రామకృష్ణ రాజు (కీసర), హిందూపూర్ శ్రీహరి (కరీంగూడ) ఉన్నారు. తాము డబ్బులు పెట్టి నిషేధిత పేకాట ఆడుతున్నట్లు నిందితులు విచారణలో అంగీకరించారని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఇన్స్పెక్టర్ పేర్కొన్నారు.

# ఘనంగా యోగాడే వేడుకలు



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకొని నాచారంలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ



కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతు యోగా చేయడంతో ఒనగూరే ప్రయోజనాలను వివరించారు, ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ 1. డాక్టర్ వీణారాణి, డాక్టర్ సంజీవరావు, ఫార్మసిస్ట్ వి వేణుకుమార్, వైద్యులు, నర్సింగ్ అధికారులు, కార్యాలయ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# హార్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేసిన ఇరాన్

## - చమురు సరఫరాపై తీవ్ర ఆందోళన!



**టెహ్రాన్ (ప్రశ్న న్యూస్)** మధ్యప్రాచ్యంలో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులకు ప్రతిస్పందనగా, ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ నిర్ణయంతో అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో ఒక్కసారిగా ఆందోళన మొదలైంది. గత కొద్ది వారాల్లోనే ఇరాన్ ఇటువంటి చర్యకు పాల్పడటం ఇది రెండోసారి కావడం గమనార్హం.ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి, ఇజ్రాయెల్ లెబనాన్‌పై నిరంతర దాడులకు పాల్పడుతోందని ఇరాన్ ఆరోపించింది. శనివారం తెల్లవారుజాము నుంచి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో సుమారు 16 నుంచి 32 మంది వరకు మరణించినట్లు లెబనాన్ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఈ దాడులకు నిరసనగానే హార్మూజ్ జలసంధిపై తాము పూర్తి నియంత్రణను తిరిగి చేపట్టినట్లు ఇరాన్ సైనిక కమాండ్ స్పష్టం చేసింది.ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో ఐదో వంతు, అలాగే భారీ మొత్తంలో సహజవాయువు రవాణా ఈ జలసంధి గుండానే సాగుతుంది. ఇరాన్‌పై ఆంక్షలను సడలించి, స్విట్జర్లాండ్‌లో అణు చర్చలు నిర్వహించాలని నిర్ణయించిన తరుణంలో ఇరాన్ తీసుకున్న ఈ నిర్ణయం ఆ చర్చలకు ఆటంకం కలిగించేలా ఉంది. ఇరాన్ చర్య ఆమోదయోగ్యం కాదని వైట్‌హౌస్ వ్యాఖ్యానించింది. అయినప్పటికీ, దౌత్యపరమైన చర్చలను కొనసాగించేందుకు ప్రయత్నిస్తామని అమెరికా వెల్లడించింది.

# రైతు బాంధవుడు - ఆత్మ చైర్మన్ చిటమట రఘు.



ఏటూరు నాగారం ( ప్రశ్న న్యూస్) కష్టానికి తగిన గుర్తింపు దక్కింది. ఏటూరునాగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిటమట రఘు ములుగు జిల్లా ఆత్మ కమిటీ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు ఆయనను ఘనంగా సన్మానించాయి.

### చిటమట రఘు మీడియాతో మాట్లాడుతూ..

శ్రమకు తగ్గ ఫలితం, పార్టీలో నాకు దక్కిన గుర్తింపు ఇది. నా మీద నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించి ప్రోత్సహించిన మంత్రి సీతక్క గారికి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు, ప్రతి కార్యకర్తకు నా హృదయపూర్వక ధన్యవాదాలు."

అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ అంటే ఆత్మ. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే ఈ కమిటీకి సారథ్యం వహించడం గొప్ప బాధ్యత. మరి చైర్మన్‌గా చిటమట రఘు ముందున్న సవాళ్లు ఏంటి

### చైర్మన్ ముందున్న ప్రధాన సవాళ్లు:

సాంకేతికత – క్షేత్ర స్థాయి: కొత్త వ్యవసాయ పద్ధతులు, డ్రోన్లు, స్మార్ట్ ఫార్మింగ్‌పై రైతులకు అవగాహన కల్పించి, వాటిని పొలం వరకు తీసుకెళ్లడం.పంట మార్పిడి ఒ మార్కెటింగ్: వాతావరణ పరిస్థితులకు తగ్గ పంటలు వేసేలా ప్రోత్సహించడం, పండిన పంటకు గిట్టుబాటు ధర వచ్చేలా మార్కెట్ లింకేజ్ ఏర్పాటు చేయడం.యువతను వ్యవసాయం వైపు: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, విద్యావంతులైన యువతను ఈ రంగంలోకి ఆకర్షించడం.ప్రభుత్వ పథకాల అమలు: రైతు భరోసా, పంట బీమా, రుణమాఫీ లాంటి పథకాలు చివరి రైతు వరకు చేరేలా చూడటం.

### ఆత్మ చైర్మన్‌గా ఆశయాలు - లక్ష్యాలు:

### రైతే రాజు:

ప్రతి రైతు ఇంట్లో సంతోషం చూడాలన్నదే నా మొదటి లక్ష్యం. ఆత్మ కమిటీ ద్వారా సాంకేతికతను రైతు గడపకు చేరుస్తాం.
ములుగు జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శ వ్యవసాయ జిల్లాగా తీర్చిదిద్దడం.

### మహిళా రైతులకు చేయూత:

సీతక్క గారి స్ఫూర్తితో, మహిళా రైతు గ్రూపులకు ప్రత్యేక శిక్షణ, ప్రోత్సాహకాలు అందించడం. పార్టీలకు అతీతంగా ప్రతి రైతుకు ఆత్మ పథకాలు అందేలా, అవినీతికి తావు లేకుండా పనిచేయడం.
పదవి అంటే అధికారం కాదు, బాధ్యత. ఆ బాధ్యతను రైతు రుణం తీర్చుకునే అవకాశంగా భావిస్తాను" అంటున్నారు నూతన ఆత్మ చైర్మన్ చిటమట రఘు.

# రెండున్నరేళ్లలో 4,032 కళ్లకు వెలుగు

- ములుగు జిల్లాలో ఉచిత కంటి శిబిరాలు: 29 విడతల్లో వేలాది మందికి ఉపశమనం
- ప్రజల గుండెల్లో జంపన్న: కంటి ఆపరేషన్లతో కొత్త జీవితాలు
- ఇంటి పెద్ద కొడుకులా అండ: ఉచిత వైద్య సేవలు.
- 29 సార్లు శిబిరాలు, 17 వేల పరీక్షలు: ములుగులో జంపన్న సేవా మార్క్



ములుగు జిల్లా (ప్రశ్న న్యూస్) ములుగు జిల్లాలో ప్రజల కళ్లలో వెలుగు నింపుతూ, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేస్తున్నారు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భూక్య జంపన్న. గత రెండున్నరేళ్లుగా ములుగు జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో 29 సార్లు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. ఇప్పటివరకు 4,032 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు విజయవంతంగా చేయించగా, 17,352 మందికి బీపీ, షుగర్ సహా ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సూచన మేరకు అవసరమైన వారికి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. 29వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులతో కలిసి జంపన్న ప్రత్యేక బస్సులో ప్రయాణించారు. ఆపరేషన్ తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్వయంగా వివరిస్తూ, వారిని సురక్షితంగా ములుగుకు, అక్కడి నుంచి సొంత



గ్రామాలకు చేర్చారు.కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న పేదలను గుర్తించి, ఆస్పత్రులకు తరలించడం నుంచి ఆపరేషన్లు పూర్తయ్యాక తిరిగి ఇళ్లకు చేర్చే వరకు ప్రతి దశలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని లబ్ధిదారులు తెలిపారు. జంపన్న మా ఇంటి పెద్ద కొడుకులా అండగా నిలబడి, ఎలాంటి స్వార్థం లేకుండా సేవ చేస్తున్నారు" అంటూ వృద్ధులు ఆశీర్వదించారు. ఆయన సేవలు వేల కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురింపజేశాయని పేర్కొన్నారు. ములుగు జిల్లాలో కంటి చూపు సమస్యల ప్రస్తావన వచ్చినప్పుడల్లా గుర్తుకొచ్చే పేరుగా జంపన్న నిలుస్తున్నారని స్థానికులు అంటున్నారు. ప్రజాసేవలో ఆయన చూపుతున్న నిబద్ధత జిల్లాకు ఆదర్శంగా మారిందని, భవిష్యత్తులో మరిన్ని బాధ్యతలు వస్తే పేదలకు మరింత మేలు జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసిన కేటుగాళ్లు

**అన్నదాతల 'ధాన్యం' మాయం**

**నకిలీ ట్రక్ చిట్టీలతో రూ.91 లక్షల ప్రజాధనం స్వాహా**

**గోదాం చేరకుండానే 10 లారీల వడ్లు గుట్టుచప్పుడు కాకుండా విక్రయం**

**ఐకేపీ, పీఏసీఎస్ కేటుగాళ్లు.. సిరిసిల్ల పోలీసుల చేతికి చిక్కిన ఆరుగురు నిందితులు**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భారీ అక్రమాలకు పాల్పడి, నకిలీ ట్రక్ చిట్టీలను సృష్టించి సుమారు రూ.91 లక్షల ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన అంతర్-జిల్లా ముఠాను సిరిసిల్ల పట్టణ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మహేష్ బి. గితే సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ కుంభకోణంలో పాల్గొన్న ఆరుగురు నిందితులను సిరిసిల్ల టౌన్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. రూ.14.16 లక్షల నగదు స్వాధీనం – – రూ.46.21 లక్షల బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్. నిందితుల నుంచి పోలీసులు రూ.14.16 లక్షల (ఖచ్చితంగా రూ.14,16,800) నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే వారి వివిధ బ్యాంక్ ఖాతాలలో ఉన్న రూ.46.21 లక్షల (ఖచ్చితంగా రూ.46,21,358) నిధులను ఫ్రీజ్ చేసినట్లు ఎస్పీ వివరించారు. ఈ కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని, నిధుల దుర్వినియోగంపై మరింత లోతుగా విచారణ చేస్తున్నామని తెలియజేశారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం పెద్దూర్ అపారెల్ పార్క్ గోదాంలో మేనేజర్‌గా పనిచేస్తున్న కరీంనగర్‌కు చెందిన ఉత్కం విజయ్ అతనితో కలిసి పనిచేస్తున్న వేములవాడ రూరల్ అర్చనపల్లి గ్రామానికి చెందిన వాసాల గణేష్ ప్రధాన సూత్రధారులుగా మారారు. వీరు ఐకేపీ కేంద్రాల నుండి ధాన్యం వచ్చినట్లు అక్రమంగా నకిలీ ట్రక్ చీటీలను తయారు చేశారు. ఈ మోసంలో భాగంగా రుద్రంగి ఐకేపీ కేంద్రం ఇన్-చార్జ్ గడ్డం స్వామి రెండు లారీలకు నకిలీ ట్రక్ చీటీలు జారీ చేయగా, వాటిని ఉత్కం విజయ్ సివిల్ సప్లై వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. అనంతరం ఆ నిధులను నిందితులు తమలో తాము పంచుకున్నారు.అదేవిధంగా, డి.ఎం.ఓ కార్యాలయంలో మండల స్థాయి కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న కమ్మరి రాజశేఖర్, బద్దెనపల్లి పీఏసీఎస్ కేంద్రం ఇన్-చార్జ్ గాజుల నవీన్ తో కలిసి ఒక లారీ ధాన్యానికి నకిలీ ట్రక్ చీటీని సృష్టించారు. దానిని ఉత్కం విజయ్‌కు అందించగా, అతను సివిల్ సప్లై వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. దీనికి రాజశేఖర్ ఆమోదం తెలిపాడు. ఆ తర్వాత విడుదలైన నిధులను ఈ ముగ్గురు పంచుకున్నారు.

### గోదాముకు రాకుండానే మాయమైన 10 లారీల ధాన్యం

ఇంకా పెద్ద ఎత్తున జరిగిన మరో మోసంలో. వివిధ ఐకేపీ కేంద్రాల నుంచి అపారెల్ పార్క్ గోదాంకు వచ్చిన 10 లారీల ధాన్యానికి సంబంధించిన నిల్వలను గోదాంలో దించకుండానే, ఆన్‌లైన్‌లో మాత్రం దించినట్లు రికార్డుల్లో తప్పుగా నమోదు చేశారు. అనంతరం ఆ ధాన్యాన్ని గోదాంలో దించకుండా నేరుగా వేములవాడకు చెందిన చేపురి మధుకర్ కు అప్పగించారు. మధుకర్ ఆ ధాన్యమును సిద్దిపేటకు చెందిన కమిషన్ ఏజెంట్ చిటుకుల శ్రీకాంత్ ద్వారా వివిధ రైస్ మిల్లులకు విక్రయించి, ఆ విధంగా వచ్చిన భారీ మొత్తాన్ని నిందితులంతా పరస్పరం పంచుకున్నారు. పై మోసాలను, అక్రమాలను గుర్తించిన జిల్లా సివిల్ సప్లై మేనేజర్ ఎస్. నరసింహ సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక పోలీస్ టీమ్‌ను ఏర్పాటు చేసి నిందితులను పట్టుకున్నారు. పోలీసులు ఈ కేసులో నిందితుల నుంచి రికవరీ చేసిన నగదు బ్యాంక్ నిధుల వివరాలను ఈ క్రింది విధంగా వెల్లడించారు.ఉత్కం విజయ్ (పెద్దూర్ అపారెల్ పార్క్ గోదాం మేనేజర్).రికవరీ: ఇతని వద్ద నుండి రూ.2,85,400 నగదు స్వాధీనం, ఇతని ఖాతాలోని రూ.37,65,358 ఫ్రీజ్ చేయబడింది. వృత్తి: మండల స్థాయి కో-ఆర్డినేటర్ ( డి ఎం ఓ కార్యాలయం), వద్ద నుండి రూ.1,50,000 నగదు స్వాధీనం. గడ్డం స్వామి రుద్రంగి ఐకేపీ కేంద్రం ఇన్-చార్జ్). చేపురి మధుకర్ వృత్తి: మల్లికార్జున రైస్ మిల్ ఓనర్, రికవరీ: ఇతని వద్ద నుండి రూ.9,81,400 నగదు స్వాధీనం, ఇతని ఖాతాలోని రూ.4,68,555 ఫ్రీజ్ చేయబడింది. వృత్తి: సూపర్‌వైజర్ ( ఎస్ డబ్ల్యూ సి గోదాం, అపారెల్ పార్క్, పెద్దూర్, సిరిసిల్ల), రికవరీ: ఇతని ఖాతాలోని రూ.8,67,711 ఫ్రీజ్ చేయబడింది. గాజుల నవీన్ వృత్తి: పీఏసీఎస్ ఇన్-చార్జ్, చిటుకుల శ్రీకాంత్ (కమిషన్ ఏజెంట్). ప్రస్తుతం నిందితులు ఉత్కం విజయ్, రాజశేఖర్, చేపురి మధుకర్, వాసాల గణేష్, గాజుల నవీన్‌లను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నకిలీ పత్రాలు సృష్టించి, ధాన్యాన్ని అక్రమంగా విక్రయిస్తూ ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన ఈ కేసులో మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# సంగుపల్లి ఎస్సీ కాలనీలో రూ.23 లక్షల సీసీ రోడ్డుకు శంకుస్థాపన



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో సంగుపల్లి ఎస్సీ కాలనీలో రూ.23 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ నక్క సంతోషిని రాములు గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వంలో గత రెండున్నర సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వల్ల పార్టీ మరింత బలోపేతమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని తెలిపారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలో మరిన్ని సీసీ రోడ్ల నిర్మాణాలకు కూడా నిధులు మంజూరు చేయించామని, అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట డీసీసీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విజయవంతంగా రెండో వారంలోకి 'పోలీస్ కంప్లైంట్' చిత్రం




హారర్ థ్రిల్లర్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన 'పోలీస్ కంప్లైంట్' చిత్రం విజయవంతంగా రెండో వారంలోకి అడుగుపెట్టింది. సౌత్ ఇండియన్ టాలెంటెడ్ నటి వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, కృష్ణ సాయి, రాగిణి ద్వివేది ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మించారు. 'అఘోర', 'పౌరుషం', 'ఆప్త', 'దండు', 'రాఘవరెడ్డి', 'ఆదిపర్వం' వంటి చిత్రాలతో క్రియేటివ్ డైరెక్టర్‌గా గుర్తింపు పొందిన సంజీవ్ మేగోటి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. వివాదాల నడుమ విడుదలైన 'పోలీస్ కంప్లైంట్' చిత్రం అన్ని కేంద్రాల్లో రెండో వారంలోనూ విజయవంతంగా ప్రదర్శించబడుతోందని చిత్రయూనిట్ ఆనందం వ్యక్తం చేసింది. ప్రేక్షకుల ఆదరణతో పలు ప్రాంతాల్లో థియేటర్ల సంఖ్యను కూడా పెంచినట్లు నిర్మాత బాలకృష్ణ మహారాణా తెలిపారు. ముఖ్యంగా దివంగత సూపర్ స్టార్ కృష్ణపై ప్రత్యేకంగా రూపొందించిన స్పెషల్ సాంగ్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుందని ఆయన పేర్కొన్నారు. 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే విభిన్న కాన్సెప్ట్ ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు హారర్ థ్రిల్లర్ అంశాలను జోడించామని దర్శకుడు సంజీవ్ మేగోటి తెలిపారు. ప్రేక్షకులకు మునుపెన్నడూ చూడని కొత్త అనుభూతిని అందించేలా కథను మలిచామని, పాత్రల రూపకల్పన కూడా ప్రత్యేకంగా ఉండటంతో అన్ని వర్గాల ప్రేక్షకులను సినిమా అలరిస్తోందని ఆయన అన్నారు. యాక్షన్, కామెడీ, రొమాన్స్, థ్రిల్లర్ అంశాల సమ్మేళనంగా రూపొందిన ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, కృష్ణ సాయి, రాగిణి ద్వివేది, ఆదిత్య ఓం, రవిశంకర్, పృథ్వి, శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి, కృతివర్మ, ప్రీతీ సుందర్, శరత్ లోహితశ్వ, జెమినీ సురేష్, దిల్ రమేష్, సత్తెన్న, విజయభాస్కర్, మధు నంబియార్, అనిల్ రాజ్, శ్రీహర్ష, దేవేందర్, పుష్పారామ్, డీఎస్పీ తదితరులు నటించారు.

దాదాపు 52 మంది సీనియర్ ఆర్టిస్టులు నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో ఎస్.ఎన్. హరీష్ సొండెకొప్ప సినిమాటోగ్రఫీ, డ్రాగన్ ప్రకాష్‌రవితేజ రూపొందించిన యాక్షన్ సన్నివేశాలు ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయని చిత్ర బృందం తెలిపింది. విభిన్నమైన కథా నేపథ్యం, బలమైన నటీనటుల సమాహారం, థ్రిల్లింగ్ అంశాలు ఈ చిత్ర విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయని దర్శకుడు సంజీవ్ మేగోటి పేర్కొన్నారు.

## 'అథిరడి' మూవీ రివ్యూ!



'అథిరడి' ఓ మలయాళ సినిమా. బాసిల్ జోసెఫ్ .. టోవినో థామస్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమాకి, అరుణ్ అనిరుద్ధన్ దర్శకత్వం వహించాడు. మే 14వ తేదీన థియేటర్లలో విడుదలైన సినిమా ఇది. 30 కోట్ల బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా, 70 కోట్లకి పైగా వసూళ్లను రాబట్టింది. అలాంటి ఈ సినిమా, ఈ నెల 19వ తేదీ నుంచి 'సోనీ లివ్'లో స్ట్రీమింగ్ అవుతోంది. యాక్షన్ కామెడీ జోనర్లో రూపొందిన ఈ సినిమా, ఐదు భాషల్లో అందుబాటులో ఉంది. సామ్ కుట్టి (బాసిల్ జోసెఫ్) ఇంజనీరింగ్ కాలేజ్ లో జాయిన్ అవుతాడు. ప్రశాంత్ తో కలుపుకుని తన కంటూ ఒక గ్యాంగ్ ను రెడీ చేసుకుంటాడు. గతంలో సామ్ కుట్టి అన్నయ్య 'జోసెఫ్' (సుకుమార్) కూడా అదే కాలేజ్ లో చదువుతాడు. ఆ సమయంలో 'ఆరోహణ్' అనే పేరుతో ప్రతి ఏడాది ఒక ఫెస్ట్ ను నిర్వహిస్తూ వస్తారు. ఒకసారి నిర్వహించిన ఫెస్ట్ లో తొక్కిసలాట జరగడంతో ముగ్గురు స్టూడెంట్స్ చనిపోతారు. అందుకు కారకుడు జోసెఫ్ అనే ముద్ర పడిపోతుంది. కాలేజ్ లో ఆ ఏడాది నుంచి ఆ ఫెస్ట్ ను నిషేదిస్తారు. తన గురించి ఆ కాలేజ్ లో ఒక చేదు అభిప్రాయం ఉండిపోవడం జోసెఫ్ ను మానసికంగా కుంగదీస్తుంది. ఆ కాలేజ్ లో ఆ ఫెస్ట్ ను మళ్లీ జరిపించి, తన అన్నయ్యతో పాటు అప్పటి బ్యాచ్ ను ఆహ్వానించాలనే ఒక బలమైన అభిప్రాయంతో సామ్ కుట్టి ఉంటాడు. అందుకు సంబంధించిన అతని ప్రయత్నాలను, స్వాతి ఆర్ కృష్ణ (రియా శిబూ) సపోర్ట్ చేస్తుంటుంది. కాలేజ్ లో నిర్వహించే ఫెస్ట్ లో పాడటానికిగాను, సింగర్ 'వినీత్ శ్రీనివాసన్' ను సామ్ కుట్టి ఒప్పిస్తాడు. అయితే ఆ సమయంలోనే స్ట్రీట్ సింగర్ అయిన కుట్టన్ (టోవినో థామస్)తో సామ్ కుట్టీ మిత్ర బృందం గొడవ పడుతుంది. వాళ్ల కారణంగా కుట్టన్ భార్య గాయపడుతుంది. కుట్టన్ పెద్ద గూండా అనీ, అతని పేరుపై చాలా కేసులున్నాయనే విషయం సామ్ కుట్టీకి ఆ తరువాతనే తెలుస్తుంది. అప్పుడు సామ్ కుట్టి ఏం చేస్తాడు? కాలేజ్ ఫెస్ట్ విషయంలో అతని ప్రయత్నం ఫలిస్తుందా? అనేది మిగతా కథ. ఒక ఇంజనీరింగ్ కాలేజ్ లో నిర్వహించిన ఫెస్ట్ లో కొంతమంది స్టూడెంట్స్ చనిపోతారు. దాంతో అప్పటి నుంచి ఆ కాలేజ్ లో ఆ ఫెస్ట్ ను నిషేధిస్తారు. అందుకు కారకుడు జోసెఫ్ అనే ముద్రపడిపోతుంది. తన అన్నయ్యపై పడిన ఆ ముద్రను చెరిపేయడం కోసం అదే కాలేజ్ లో సామ్ కుట్టి చేరతాడు. ఆ ఫెస్ట్ ను మళ్లీ జరిపించడం కోసం అతను చేసే ప్రయత్నమే ఈ సినిమాలోని ప్రధానమైన కథాంశం. హీరో ఒక ఇంజనీరింగ్ కాలేజ్ లో చేరడం .. అతని స్టైల్ .. యాటిట్యూడ్ .. తన అన్నయ్య విషయంలో తాను అనుకున్నది సాధించాలనే ఒక ఆరాటం తాలూకు సన్నివేశాలతో ఫస్టాఫ్ నడుస్తుంది. ఫ్రెండ్షిప్ .. లవ్ .. అల్లర్లు .. ఆకతాయి వేషాలతో సరదాగా సాగిపోతుంది. ఇక టోవినో థామస్ ఎంట్రీతో సెకండాఫ్ కొనసాగుతుంది. హీరో ప్రయత్నాలకు కుట్టన్ అడ్డుపడటం .. అతణ్ణి దాటుకుని హీరో ముందుకు వెళ్లడం వంటి సన్నివేశాలు సెకండాఫ్ ను ముందుకు తీసుకుని వెళతాయి. ఇక కథ ప్రీ క్లైమాక్స్ కి చేరుకునే సరికి, సింగర్ వినీత్ శ్రీనివాస్ కిడ్నాప్ డ్రామా మొదలవుతుంది. కాలేజ్ ఫెస్ట్ జరగకుండా కుట్టన్ గ్యాంగ్ అతణ్ణి కిడ్నాప్ చేయడం, ఆ గ్యాంగ్ బారి నుంచి అతణ్ణి విడిపించి తీసుకుని రావడానికి సామ్ కుట్టి బ్యాచ్ రంగంలోకి దిగడంతో ఈ డ్రామా పీక్ స్టేజ్ కి చేరుకుంటుంది. కాలేజ్ నేపథ్యంలో లవ్ .. కామెడీ .. యాక్షన్ .. ఎమోషన్స్ ను కలుపుకుంటూ దర్శకుడు ఈ కథను తయారు చేసుకున్నాడు. ప్రధానంగా యూత్ ను దృష్టిలో పెట్టుకుని సన్నివేశాలను నడిపించాడు. సాధారణంగా కాలేజ్ క్యాంపస్ కథలు అనగానే లవ్ కీ .. ఫ్రెండ్ షిప్ కీ ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తారు. కానీ ఈ కథలో దర్శకుడు వాటిని పెద్దగా పట్టించుకోకపోవడం అసంతృప్తిని కలిగిస్తుంది. ఇక హీరోకి కాలేజ్ క్యాంపస్ లో కాకుండా బయటి నుంచి విలనిజం ఎదురవుతుంది. టోవినో థామస్ పాత్ర ఎంట్రీ .. తన ప్రమేయం లేకుండానే హీరో అతనికి శత్రువు కావడం వంటి సీన్స్ బాగున్నాయి. కుట్టన్ పేరుగల ఆ పాత్రకి ఇచ్చిన బిల్డప్ కూడా ఆసక్తికరంగా ఉంటుంది. కాకపోతే ఆ తరువాత కథ మాత్రం ఆడియన్స్ అంచనాలకి తగినట్టుగా సాగదు. పేలవమైన సన్నివేశాలకు సరైన కామెడీ తోడు లేక తేలిపోతుంటాయి. చివరివరకూ అదే పరిస్థితి కొనసాగడమే విచారించదగిన విషయం. బాసిల్ జోసెఫ్ లుక్ .. అతని యాటిట్యూడ్ .. నటనకి వంక బెట్టవలసిన పనిలేదు. కామెడీ పరంగా ఆయన ఆల్రెడీ ప్రూవ్ చేసుకున్నాడు. అయితే ఈ సినిమా విషయంలో ఆయన పాత్రను బాగానే డిజైన్ చేశారుగానీ, కథాపరమైన బలం లేకపోవడం నిరాశను కలిగిస్తుంది. ఇక టోవినో పాత్రలోను ఆడియన్స్ ఆశించే పవర్ కనిపించలేదు. హీరోయిన్ పేరుకే తప్ప, ఆ పాత్ర వైపు నుంచి ఎలాంటి ప్రయోజనం జరగలేదు. సామ్యూల్ హెన్రీ ఫొటోగ్రఫీ బాగుంది. విష్ణు విజయ్ నేపథ్య సంగీతం ఫరవాలేదు. ఛమన్ చాకో ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తుంది. బాసిల్ జోసెఫ్ సినిమా అనగానే ఆడియన్స్ ఆశించేది బలమైన కామెడీ. కానీ అది ఈ సినిమాలో మనకి కనిపించదు. అక్కడక్కడా కాస్త నవ్వు ముఖం పెడతాం గానీ, బాసిల్ సినిమా నుంచి ఊహించినదానికి అది చాలా తక్కువనే చెప్పాలి. లుక్ పరంగా .. బాడీ లాంగ్వేజ్ పరంగా బాసిల్ నవ్వించగలిగాడు గానీ, కథాకథనాల పరంగా మెప్పించలేకపోయాడని చెప్పాలి.

## సమంత 'మా ఇంటి బంగారం' ఫస్ట్ డే కలెక్షన్స్.. తెలుగులో దుమ్మురేపిన ఓపెనింగ్!



సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'మా ఇంటి బంగారం' థియేటర్లలో సాలిడ్ ఓపెనింగ్ సాధించింది. ట్రేడ్ వర్గాల ప్రకారం ఈ చిత్రం తొలిరోజు భారతదేశంలో రూ.5.35 కోట్ల నెట్ వసూళ్లను రాబట్టినట్లు తెలుస్తుంది. దీంతో ఇండియా గ్రాస్ కలెక్షన్ సుమారు రూ.8.20 కోట్లుగా నమోదుకాగా. దేశవ్యాప్తంగా 2,658 షోలలో ఈ సినిమా ప్రదర్శితమైంది. ఓవర్సీస్ మార్కెట్ నుంచి మరో రూ.6.50 కోట్ల గ్రాస్ రావడంతో తొలిరోజు వరల్డ్‌వైడ్ గ్రాస్ కలెక్షన్ రూ.13.25 కోట్లకు చేరింది. రిజియన్ వారీగా చూస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కలిపి రూ.4.75 కోట్ల గ్రాస్‌తో టాప్‌లో నిలిచాయి. కర్ణాటకలో రూ.90 లక్షలు, తమిళనాడులో రూ.38 లక్షల గ్రాస్ వసూళ్లు నమోదయ్యాయి. తెలుగు 2డి వెర్షన్‌కు ఆక్యుపెన్సీ రోజంతా పెరుగుతూ వచ్చింది. ఉదయం షోలకు 26.15 శాతం ఉన్న ఆక్యుపెన్సీ, రాత్రి షోలకు 51.38 శాతానికి చేరింది. ప్రీమియం తెలుగు ఐమాక్స్ ఫార్మాట్‌కు 96 శాతం ఓవరాల్ ఆక్యుపెన్సీ నమోదైంది. హైదరాబాద్‌లో దాదాపు హౌస్‌ఫుల్స్ పడగా, రాత్రి షోలకు 100 శాతం ఆక్యుపెన్సీ వచ్చింది. 'కుషి' 2023 తర్వాత సమంత తెలుగు సినిమాలో లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై విడుదలకు ముందు నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఆ అంచనాలను నిజం చేస్తూ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, మంజుష, శ్రీముఖి కీలక పాత్రల్లో నటించారు.

## గతాన్ని పూర్తిగా మర్చిపోవాలి

### – శోభిత ధూళిపాళ



అక్కినేని నాగచైతన్యతో వివాహం జరిగిన తర్వాత సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చిన శోభిత ధూళిపాళ.. రీసెంట్‌గా 'చీకటిలో' వెబ్‌సిరీస్‌తో డిజిటల్ స్క్రీన్‌పై మంచి థ్రిల్ ఇచ్చారు. ప్రస్తుతం కోలీవుడ్ క్రేజీ డైరెక్టర్ పా రంజిత్ తెరకెక్కిస్తున్న సైన్స్ ఫిక్షన్ డ్రామా 'వెట్టువం' షూటింగ్‌తో బిజీగా ఉన్న ఈ బ్యూటీ... తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చేసిన కొన్ని పర్సనల్ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతమైన చర్చకు దారితీశాయి. ఇంటర్వ్యూలో భాగంగా యాంకర్ శోభితను ఒక పర్సనల్ క్వశ్చన్ అడిగారు. "మీ లైఫ్‌లో ఏ విషయాన్ని పూర్తిగా మర్చిపోవాలని అనుకుంటున్నారు?" అని ప్రశ్నించగా... దానికి శోభిత ఏమాత్రం తడబడకుండా.. "నిన్నటి వరకు నా జీవితంలో జరిగిన ప్రతి సంఘటనను, జ్ఞాపకాన్ని పూర్తిగా మర్చిపోవాలని అనుకుంటున్నాను" అని ఆన్సర్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. తన సమాధానానికి గల కారణాన్ని వివరిస్తూ.. "సాధారణంగా లోకం మతిమరుపును ఒక జబ్బుగా చూస్తుంది. కానీ నా దృష్టిలో కొన్నిసార్లు మతిమరుపు అనేది మనిషికి దొరికే ఒక గొప్ప వరం. ఎందుకంటే లైఫ్‌లో వేరే వాళ్లు మన పట్ల చేసిన బాధాకరమైన పనులు, మన మనసును గాయపరిచిన చేదు జ్ఞాపకాలను మనం మర్చిపోయినప్పుడే జీవితంలో ఫ్రీగా ముందుకు సాగడం సాధ్యమవుతుంది" అని చెప్పుకొచ్చారు. పాత జ్ఞాపకాలలోనే ఎప్పుడూ కూరుకుపోకుండా, వాటన్నింటినీ డిలీట్ చేసేసి రేపటి భవిష్యత్తు గురించి పాజిటివ్‌గా ఆలోచించడమే నేటి అవసరమని శోభిత క్లారిటీ ఇచ్చారు.

## నాగదుర్గ నాయికగా తెలంగాణ నేపథ్య చిత్రం



తెలంగాణ జానపద గీతాల్లో అద్భుత నాట్యాభినయాన్ని ప్రదర్శిస్తూ మంచి పేరు సంపాదించుకుంది నాగదుర్గ. ఆమె పాటలు, ప్రైవేట్ ఆల్బమ్స్ సోషల్‌మీడియాలో రికార్డు స్థాయి వీక్షణలతో ప్రేక్షకుల్ని అలరించాయి. తాజాగా ఆమె కథానాయికగా అరంగేట్రం చేస్తున్నది. ప్రియదర్శి హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు సుకుమార్, నిర్మాత బన్నీ వాసు తెరకెక్కిస్తుండటం విశేషం. తెలంగాణ నేపథ్య కుటుంబ కథాంశంతో రూపొందనున్న ఈ చిత్రానికి వంశీ రెడ్డి దర్శకత్వం వహించనున్నారు. ఈ నెల 25న లాంఛనంగా సినిమాను ప్రారంభించి, వచ్చే నెలలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతామని, ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి.

## 'సేవ్ ద టైగర్స్ 3' సిరీస్ రివ్యూ!



'సేవ్ ద టైగర్' సిరీస్ నుంచి గతంలో రెండు భాగాలు వచ్చాయి. ప్రియదర్శి .. కృష్ణ చైతన్య .. అభినవ్ గౌతమ్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్ నుంచి వచ్చిన రెండు భాగాలకి కూడా అనూహ్యమైన రెస్పాన్స్ లభించింది. ఈ నేపథ్యంలో ఈ సిరీస్ నుంచి మూడో భాగాన్ని వదిలారు. ఈ నెల 19వ తేదీ నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ అవుతోంది. ఫాంటసీ టచ్ ఇచ్చిన మూడో సీజన్ ఎలా ఉందనేది ఇప్పుడు చూద్దాం. గంటా రవి ( ప్రియదర్శి) తన భార్య హైమా (సుజాత) పోరు పడలేక గేటెడ్ కమ్యూనిటీకి మారిపోతాడు. అయితే అక్కడి వాతావరణంలో ఇమడలేక నానా ఇబ్బందులు పడుతూనే రాజకీయాలలో ఎదుగుతూ ఎమ్మెల్యే అవుతాడు. ఇక రాహుల్ (అభినవ్ గౌతమ్) రైటర్ గా బిజీ అవుతాడు. అవార్డులతో పాటు విమర్శలు వచ్చి పడుతుంటాయి. విక్రమ్ ( చైతన్య కృష్ణ) హారిక అనే అమ్మాయితో చనువుగా ఉండటం చూసిన అతని భార్య రేఖ విడాకుల నోటీసు పంపిస్తుంది. ఒక వైపున కోర్టు చుట్టూ తిరుగుతున్నప్పటికీ, విక్రమ్ తన పద్ధతి మాత్రం మార్చుకోడు. గంటా రవి తన పదవిని అడ్డుపెట్టుకుని భూ కబ్జాలకు పాల్పడుతూ ఉంటాడు. రాహుల్ కొత్త కథల కోసం ప్రయత్నించకుండా వేరొకరి కథలను కాపీ చేస్తుంటాడు. భార్యకి దూరమైన విక్రమ్ వేరే అమ్మాయిలను వేధించడం మొదలు పెడతాడు. ఈ క్రమంలోనే ఈ ముగ్గురిపై పోలీస్ లకు ఫిర్యాదులు అందుతాయి. పోలీస్ కేసు ముగ్గురినీ భయపెడుతుంది. ఈ గండం నుంచి ఎలా గట్టెక్కాలా అనే విషయంపై ఒక క్లబ్ లో సమావేశమవుతారు. తమ పట్ల భార్యలు ప్రవర్తిస్తున్న తీరును గురించి ప్రస్తావిస్తారు. తమని ఈ స్థితికి తీసికొచ్చింది 'పెళ్లి' అనే రెండు అక్షరాలేనని భావిస్తారు. పెళ్లిళ్లు స్వర్గంలో జరుగుతాయని చెప్పినదెవరంటూ దేవతలను తిట్టడం మొదలు పెడతారు. తమని శాపనార్థాలు పెట్టే ఆ దృశ్యాన్ని ఇంద్రుడు నేరుగా చూస్తాడు. అప్పుడు ఆయన ఏం చేస్తాడు? పర్యవసానంగా ఈ ముగ్గురికి ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? అనేది మిగతా కథ. గంట రవి .. రాహుల్ .. విక్రమ్ అనే ముగ్గురు స్నేహితులచుట్టూ తిరిగే కథ ఇది. ఈ ముగ్గురి కుటుంబాలు .. భార్యాభర్తల సంబంధాలు .. బంధాలు .. అలకలు .. ఆవేశాల చుట్టూ ఈ కథను అల్లుకుంటూ వెళ్లారు. మద్యానికి అలవాటు పడటం వలన ఎలాంటి సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందనేది అనుభవపూర్వకంగా తెలుసుకుంటారు. అందుకు సంబంధించిన సన్నివేశాలతో మొదటి రెండు భాగాలు ప్రేక్షకులను అలరిస్తూ వచ్చాయి. ఇక ఈ సారి ఈ ముగ్గురు మిత్రులు పెళ్లి అనే కాన్సెప్ట్ తో తమని ఒక ఆట ఆడిస్తున్న దేవుడిని నిందిస్తారు. ఇక్కడి నుంచి ఈ కథ ఫాంటసీని టచ్ చేస్తుంది. దేవేంద్రుడు .. చిత్రగుప్తుడు వంటి పాత్రలు ఎంట్రీ ఇస్తాయి. మనుషులను పోలిన మనుషులు అంటూ మరో అంశం కూడా ఇక్కడి నుంచి ఈ కథకి తోడవుతుంది. ఇక ఇక్కడి నుంచి కథ కొత్త మలుపు తీసుకుని ముందుకు వెళుతుంది. అయితే ఈ డ్రామా కాస్త కన్ఫ్యూజింగ్ గానే ఉంటుంది. కన్ఫ్యూజింగ్ డ్రామా అంటూ వాళ్లు ముందుగానే చెప్పేశారు కూడా. ముగ్గురు స్నేహితులు దేవుళ్లను తిట్టడం .. చిత్రగుప్తుడు వంటి పాత్రలు దిగిరావడం వరకూ బాగానే ఉందిగానీ, మనుషులను పోలిన మనుషులు అంటూ అవే మూడు పాత్రలను ప్రవేశపెట్టడం అయోమయాన్ని కలిగిస్తుంది. ఈ కాన్సెప్ట్ ఆడియన్స్ అర్థం చేసుకోవడానికీ .. అర్థం కావడానికి కొంత సమయం పడుతుంది. కొంతమందికి ఆ అయోమయం అలా ఉండిపోవచ్చు కూడా. పెళ్లి అనేది ఒక బరువు కాదు .. బాధ్యత. పెళ్లి అనేది ఒక పంజరం కాదు .. అందమైన అనుబంధం. స్వేచ్ఛ పేరుతో బాధ్యతల నుంచి దూరంగా పారిపోవడం కరెక్టు కాదని చెప్పే ఒక సందేశం బాగుంది. అయితే ఆ విషయాన్ని చెప్పడానికి మనుషులను పోలిన మనుషులు అంటూ రెండేసి ప్రధానమైన పాత్రలను చూపించడం కాస్త గందరగోళంగానే అనిపిస్తుంది. లాజిక్ కి అందకుండా .. క్లారిటీ లోపించి కనిపిస్తుంది. దేవేంద్రుడిగా వెన్నెల కిశోర్ కనిపించడం .. హుక్ స్టెప్ ప్రాక్టీస్ అంటూ సందడి చేయడం బాగుంది. 'గొడవపడితే మాట్లాడదేమోనని భయపడేవాడు ప్రేమికుడు. మాట్లాడితే గొడవ పడుతుందేమోనని భయపడేవాడు మొగుడు' వంటి డైలాగ్స్ అక్కడక్కడా మెరుస్తాయి. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ కథకు తమవంతు సపోర్టును అందించాయి. 'సేవ్ ద టైగర్స్' సిరీస్ కామెడీ ప్రధానంగా రూపొందుతూ వస్తున్న సిరీస్ అనే విషయం అందరికీ తెలిసిందే. అలాగే ఈ సారి కూడా కామెడీ దిశగా కంటెంట్ ను పరిగెత్తించే ప్రయత్నమే చేశారు. కాకపోతే ఫాంటసీ టచ్ కారణంగా కాస్త క్లారిటీ లోపించినట్టుగా అనిపిస్తుంది.

# రూపాదేవి స్మారకంగా టాపర్లకు నగదు బహుమతులు

- విద్యార్థులకు ప్రోత్సాహకంగా స్టడీ మెటీరియల్ పంపిణీ
- ఎడ్యుకేషన్ హబ్ గా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతున్న ఎమ్మెల్యే సత్యం
- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు : మంత్రి మహేందర్




గంగాధర (ప్రశ్న న్యూస్) గంగాధర మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి రెండో వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. గంగాధర ప్రజా కార్యాలయంలో స్వర్గీయ రూపాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగాధర మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 260 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అలాగే ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను నగదు బహుమతులతో సత్కరించారు. కురిక్యాల గ్రామానికి చెందిన కె. శ్రీజకు మొదటి టాపర్‌గా రూ.6 వేల నగదు బహుమతి, బూరుగుపల్లి గ్రామానికి చెందిన బి. సంజనకు రెండో టాపర్‌గా రూ.4 వేల నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంత్రి మహేందర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా సేవలందించిన రూపాదేవి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందాలనే ఆశయంతో పనిచేశారని తెలిపారు. ఆమె ఆశయాలకు అనుగుణంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముద్దం నగేష్, మాజీ జెడ్పీటీసీ సత్తు కనకయ్య, సర్పంచ్‌లు వేముల భాస్కర్, రేండ్ల శ్రీనివాస్, బీర్ల ఆనంద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, కాంగ్రెస్ నాయకులు జాగిరపు శ్రీనివాస్ రెడ్డి, పడాల రాజన్న, రాచమల్ల భాస్కర్, బైరిశెట్టి సంపత్, రేండ్ల రాజిరెడ్డి, దూలం వీరేశం, గుజ్జుల బాపురెడ్డి, కోలేపాక స్వామి, ఆరె రాజశేఖర్, ప్రవీణ్ రెడ్డి, కడారి కనకయ్య, చిందం ఆంజనేయులు, దానే ఓదలు, బాసవేని శ్రీనివాస్, లింగాల లింగయ్య, దాతు అంజి, పెంచాల చందు, ముచ్చె శంకరయ్య, కొలపురి లక్ష్మణ్, మెర్జ కొండయ్య, తాళ్ల శ్రీనివాస్, తాళ్ల సురేష్, ప్రేమ్, శ్రీకాంత్, తోట సంధ్యతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# కవితక్కకు పెరుగుతున్న ఆదరణతో ప్రత్యర్థుల్లో ఆందోళన

- టీఆర్ఎస్ ఫ్లెక్సీ దహనం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- కవితక్క సభ విజయవంతం చేసిన వారికి కృతజ్ఞతలు
- టీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి : మజీద్





సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈనెల 18న తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత పర్యటన సందర్భంగా నిర్వహించిన జెండా పండుగ, భారీ సభను విజయవంతం చేసిన ప్రజలకు టీఆర్ఎస్ జిల్లా ఇంచార్జి మజీద్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పలు మండలాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా భారీగా తరలివచ్చి కవితక్కకు ఘన స్వాగతం పలికారన్నారు. కవితక్క సభకు లభించిన ప్రజాదరణను చూసి ప్రత్యర్థి పార్టీ నాయకులు భయాందోళనలకు గురయ్యారని ఆరోపించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కేసీఆర్ నగర్ వద్ద టీఆర్ఎస్ నాయకుడు కదిరే భాస్కర్ గౌడ్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఇద్దరు వ్యక్తులు తగలబెట్టిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనలో పాల్గొన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కవితక్కను రాష్ట్ర ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని, ఒక మహిళ ముఖ్యమంత్రి అయితే మహిళల సమస్యలకు మరింత ప్రాధాన్యత లభిస్తుందని సభకు వచ్చిన మహిళలు అభిప్రాయపడ్డారని మజీద్ పేర్కొన్నారు. సభ విజయవంతం కాకుండా కొందరు అడ్డంకులు సృష్టించినప్పటికీ ప్రజా స్పందన ముందు అవన్నీ విఫలమయ్యాయని అన్నారు. రాజకీయ విభేదాలతో ఇటువంటి విధ్వంసక చర్యలకు పాల్పడటం తగదని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని హెచ్చరించారు. ఫ్లెక్సీ దహనం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

# విద్యార్థుల అభివృద్ధే రూపాదేవికి నిజమైన నివాళి

- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు : కొమ్మనబోయిన సువీన్ యాదవ్
- రూపాదేవి ద్వితీయ వర్ధంతి...! సేవా కార్యక్రమాలతో ఘన నివాళులు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం సతీమణి స్వర్గీయ మేడిపల్లి రూపాదేవి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మనబోయిన సువీన్ యాదవ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రీ - ప్రైమరీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమైన సువీన్ యాదవ్ వారి చదువుల గురించి ఆరా తీసి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రూపాదేవి ప్రజాసేవ పట్ల ప్రత్యేకమైన నిబద్ధత కలిగిన వ్యక్తి అని పేర్కొన్నారు. ఆమె జ్ఞాపకాలను స్మరించుకుంటూ విద్యార్థులకు ఉపయోగపడే విద్యా సామగ్రిని అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్య అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని తమ లక్ష్యాలను సాధించాలని, విద్య ద్వారానే మంచి భవిష్యత్తును నిర్మించుకోవచ్చని సూచించారు. రూపాదేవి ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నల్ల మోహన్, మండల శ్రీనివాస్, మెరుపుల జలందర్, పిట్టల మోహన్, ముచ్చ శేఖర్ రెడ్డి, రజనీకాంత్, వెంకటేష్, వేణు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు విద్యా సామగ్రి అందించిన కొమ్మనబోయిన సువీన్ యాదవ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# క్యాన్సర్ బాధితురాలికి ఎడపల్లి బాబు చేయూత - పరామర్శ



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, బూరుగుపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి లత క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న సామాజిక సేవకుడు ఎడపల్లి బాబు మానవత్వాన్ని చాటుకున్నారు. శనివారం ఆయన ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5,000 నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లత ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్న ఎడపల్లి బాబు, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. అవసర సమయంలో అందరూ ముందుకు వచ్చి సహాయం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య, వార్డు సభ్యుడు అతికం రాజశేఖర్ గౌడ్, సామాజిక సేవకులు బోయిని హరీష్,రాకేష్, ఎడపల్లి వంశీ,బీసీ సంఘాల నాయకులు ముద్దం లక్ష్మీరాజం తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి తమ సంఘీభావం తెలిపారు.

# గజ్వేల్‌లో తొలిసారిగా థొరాకోస్కోపీ ద్వారా ఊపిరితిత్తుల క్యాన్సర్ గుర్తింపు



గజ్వేల్ (ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని విశ్వనాథ్ చెస్ట్ హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య సాంకేతికతతో ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను విజయవంతంగా గుర్తించారు. కోలాభిరామ్ గార్డెన్ ఎదురుగా, ముట్రాజ్‌పల్లి రోడ్డులో ఉన్న ఈ ఆసుపత్రిలో ప్రముఖ ఛాతి వైద్య నిపుణులు డాక్టర్ నరేన్ విశ్వనాథ్ గజ్వేల్‌లో తొలిసారిగా థొరాకోస్కోపీ పద్ధతి ద్వారా ఒక రోగికి ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను నిర్ధారించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేన్ విశ్వనాథ్ మాట్లాడుతూ, థొరాకోస్కోపీ మరియు బ్రోంకోస్కోపీ వంటి ఆధునిక పరికరాల సహాయంతో ప్రారంభ దశలోనే వివిధ రకాల న్యుమోనియాలు, ఊపిరితిత్తుల క్యాన్సర్, ఊపిరితిత్తుల్లో నీరు లేదా గాలి చేరడం వంటి సమస్యలను ఖచ్చితంగా గుర్తించి తగిన చికిత్స అందించవచ్చని తెలిపారు. ఇప్పటివరకు హైదరాబాద్ వంటి మహానగరాల్లో మాత్రమే అందుబాటులో ఉన్న ఈ ఆధునిక వైద్య సేవలను గజ్వేల్ ప్రజలకు చేరువ చేయడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. స్థానిక ప్రజలు ఈ అత్యాధునిక వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కొత్త సాంకేతికత అందుబాటులోకి రావడంతో గజ్వేల్ మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన ఊపిరితిత్తుల వైద్య సేవలు అందనున్నాయని వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ప్రజల సమస్యలకు ఎర్రజెండానే ప్రత్యామ్నాయం

## కూనంనేని సాంబశివరావు




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్) దేశంలో నెలకొన్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితుల్లో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపగల శక్తి ఎర్రజెండా మాత్రమేనని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కూనంనేని సాంబశివరావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతూ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. శనివారం గజ్వేల్‌లో నిర్వహించిన సీపీఐ ఉమ్మడి మెదక్ జిల్లా కౌన్సిల్ సభ్యుల రాజకీయ శిక్షణ తరగతుల రెండో రోజు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతాంగ సంక్షోభం, కార్మిక వర్గంపై జరుగుతున్న దాడులు, సామాన్య ప్రజల జీవన ప్రమాణాల క్షీణతపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ, వారి హక్కుల కోసం పోరాడే పార్టీ సీపీఐ మాత్రమేనని ఆయన అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి వరకు ప్రజా ఉద్యమాలకు సీపీఐ అండగా నిలిచిందని, రైతులు, కార్మికులు, కూలీలు, పేదలు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రాంతంలో భూస్వామ్య, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో కమ్యూనిస్టుల పాత్ర చారిత్రాత్మకమైందని పేర్కొంటూ, ప్రజల భూమి, భుక్తి, విముక్తి కోసం కమ్యూనిస్టు ఉద్యమం చేసిన త్యాగాలు నేటి తరాలకు ఆదర్శమని అన్నారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమవుతున్నాయని, కార్పొరేట్ శక్తులకు అనుకూల విధానాలు అమలు చేస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల పక్షాన నిలబడి ప్రత్యామ్నాయ విధానాలను ముందుకు తీసుకెళ్తున్న పార్టీ సీపీఐ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం కోసం పోరాటాలు నిర్వహించడం, ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడం, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలవడం సీపీఐ లక్ష్యమని తెలిపారు. ప్రతి పార్టీ కార్యకర్త ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ శిక్షణ తరగతులు పార్టీ సిద్ధాంతాలు, కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, సమకాలీన రాజకీయ పరిస్థితులపై అవగాహన పెంపొందించేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యకర్తలు ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకుని గ్రామాలు, పట్టణాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. "ప్రజల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, లౌకిక ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుంది. దేశ ప్రజలకు ఎర్రజెండానే నిజమైన ప్రత్యామ్నాయం" అని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు వీర్ల ప్రకాశ్‌రావు, బట్టు దయానందరెడ్డి, మంద పవన్, ఖలీక్, జలాలుద్దీన్, రెహ్మాన్, ఆనంద్, కొమ్ముల భాస్కర్, యెడల వనేశ్, జేరిపోతుల జనార్ధన్, పిల్లి రజిని, స్వర్గం రాజేశం, శివలింగు కృష్ణ, గజాభీమకర్ బన్సీలాల్, నర్సింహారెడ్డి, సంగెం మధు, రామగళ్ల నరేష్, హరిఫ్‌తో పాటు సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన సీపీఐ కౌన్సిల్ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌లతో వేగవంతమైన న్యాయం

- జూనియర్ సివిల్ జడ్జి మాధవి



మెట్ పల్లి (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా,మెట్‌పల్లి మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం మెట్‌పల్లి కోర్టు ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి మాట్లాడుతూ, లోక్ అదాలత్‌ల ద్వారా కక్షిదారులకు త్వరితగతిన న్యాయం అందుతుందని పేర్కొన్నారు. పరస్పర అవగాహనతో వివాదాలను పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం రెండూ ఆదా అవుతాయని ఆమె వివరించారు. లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కారమైన కేసులపై అప్పీల్‌కు అవకాశం ఉండదని తెలిపారు. అనంతరం నిర్వహించిన రెండో జాతీయ మెగా లోక్ అదాలత్‌లో మొత్తం 1,645 కేసులను పరిష్కరించారు. వీటిలో పరస్పర రాజీ ద్వారా 97 కేసులు, మీడియేషన్ ద్వారా 16 కేసులు, అడ్మిషన్ ద్వారా 58 కేసులు, పీఎల్‌సీ ద్వారా 25 కేసులు, ఎస్‌టీసీ ద్వారా 1,449 కేసులు పరిష్కారమయ్యాయి. అడ్మిషన్ కేసుల ద్వారా కక్షిదారులు రూ.4,56,200 చెల్లించగా, పీఎల్‌సీ కేసుల పరిష్కారంలో భాగంగా రైతులు బ్యాంకులకు రూ.6,78,629 చెల్లించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దయ్యా రాజారాం, ఏపీపీ జి. ప్రణయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రామ్ రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు వడ్డేపల్లి శ్రీనివాసన్, జేడి సుధాకర్, మీడియేషన్ సభ్యులు ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, తునికి వేణుగోపాల్, పసునూరి శ్రీనివాస్, న్యాయవాదులు జిల్లా వెంకటేశ్వర్లు, మగ్గిడి వెంకట నర్సయ్య, గడ్డం శంకర్ రెడ్డి, పోలకొండ దయాకర్ వర్మ, పుప్పాల భానుమూర్తి, వేముల సునీల్, పసునూరి సుదర్శన్, మామిడిపల్లి విజయలక్ష్మి, పడిగేల శ్రీనివాస్, గజ భీంకర్ వెంకటేష్, నీరటి రమణ, మార్క వంశీ, తలారి రాజశేఖర్, కోల అశోక్, ద్యావని సత్యనారాయణ, అందె సంజయ్ కుమార్, తుల రాజేందర్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా

## జెనెసిస్ ఇంటర్నేషనల్ స్కూల్, మదీనాగూడ



శేరిలింగంపల్లి(ప్రశ్న న్యూస్) మదీనాగూడ జెనెసిస్ ఇంటర్నేషనల్ స్కూల్ లో 2026 జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 7(టి) గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ మరియు 1(టి ) ఆర్టిలరీ బ్యాటరీ ఎన్‌సీసీ క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలను ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ నళిని దాడి , వైస్ ప్రిన్సిపాల్ మరియా వెనీషా ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ గీతా జోసెఫ్ సెకండ్ ఆఫీసర్ రవికుమార్ ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా యొక్క ప్రాముఖ్యత, శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత మరియు క్రమశిక్షణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు యోగా ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సందేశం అందించారు. పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, యోగా అనేది భారతీయ సంస్కృతికి ప్రతీక అని, ప్రతి విద్యార్థి నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని సూచించింది. కార్యక్రమం విజయవంతంగా ముగియగా, విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు మరియు ఉపాధ్యాయులు యోగా దినోత్సవాన్ని ఉత్సాహభరితంగా జరుపుకున్నారు.

# ఏసీబీ వలలో తహశీల్దార్

**నెల్లూరు** ఏ.ఎస్.పేట తహసీల్దార్ శాంతిస్వరూప్ లంచం తీసుకుంటూ ఏసీబీ చిక్కాడు. రైతు కృష్ణారెడ్డి నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ శాంతిస్వరూప్, ఒక పాస్ పుస్తకంలో పేరు మార్చేందుకు రైతు నుంచి లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణ.

# లక్షల్లో జీతాలు.. వందల కోట్లలో ఆస్తులు

## అడ్డదారుల్లో అక్రమ సంపాదన

- అనతికాలంలోనే ఊహించనంతగా కోటీశ్వరులుగా ప్రభుత్వ అధికారులు
- రాజకీయ నేతల అండదండలు.. 'ఫోకల్' పోస్టింగుల కోసం తెరవెనుక కోట్లతో బేరసారాలు
- బదిలీల ముప్పు రాకుండా పొలిటికల్ గాడ్‌ఫాదర్ల రక్షణ కవచం
- ఉన్నతాధికారులకు సైతం తెలియకుండా రహస్య సెటిల్‌మెంట్లు
- కార్యాలయాల్లో సమాంతర దందాలు
- బినామీ'ల పేరిట విల్లాలు, ఫామ్‌హౌస్‌లు, వందల ఎకరాల భూములు
- లంచాల సొమ్ము రియల్ ఎస్టేట్‌లోకి డైవర్షన్
- ఏసీబీ ఆకస్మిక తనిఖీలతో బట్టబయలవుతున్న అక్రమ సామ్రాజ్యాలు
- కదులుతున్న అవినీతి తిమింగలాల మూలాలు
- ప్రభుత్వ చట్టాలను నాశనం చేస్తూ అక్రమ సంపాదనలు
- అందుకే సామాన్యులకు అందని న్యాయం
- ప్రభుత్వ అధికారులు అంటేనే గజ గజ పోతున్న ప్రజలు
- ప్రభుత్వ ఏ శాఖలో అయిన లంచం లేకుండా పని అవుతుంది అన్న ధీమా ఉందా.?
- అవినీతి అధికారులతో ప్రభుత్వ చట్టాలు అభాసుపాలు









**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్ )** నెలకు వచ్చేది ప్రభుత్వ జీతం.. అది కూడా లక్షల్లోనే. కానీ ఐదేళ్లు తిరిగేసరికి సదరు అధికారి ఆస్తి విలువ వందల కోట్లకు చేరుతోంది. చట్టాన్ని, ప్రజలను రక్షించాల్సిన కుర్చీల్లో కూర్చుని.. అదే అధికారంతో అక్రమ సామ్రాజ్యాలను నిర్మిస్తున్నారు కొందరు లంచగొండి అధికారులు. నిన్నటివరకు సాధారణ జీవితం గడిపిన కొందరు అధికారులు నేడు విలాసాలలో తేలుతున్నారు. అనతికాలంలోనే ఊహించనంతగా కోటీశ్వరులుగా మారుతున్న కొందరు అధికారుల తీరు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారుతుంది.

### అడ్డదారుల్లో అక్రమ సంపాదన..

సమాజంలో హోదా, గౌరవప్రదమైన వేతనం ఉన్నప్పటికీ కొందరు అధికారులకు ఆశ చావడం లేదు. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా లంచం లేనిదే ఫైలు కదలని పరిస్థితిని కల్పిస్తున్నారు. సామాన్యుల నుంచి కార్పొరేట్ సంస్థల వరకు ప్రతి ఒక్కరినీ పీల్చి పిప్పి చేస్తూ, అడ్డదారుల్లో అక్రమ సంపాదనకు తెరలేపారు. రాత్రికి రాత్రే కోట్లు సంపాదించాలనే ఆరాటంతో వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు.

### రాజకీయ నేతల అండదండలు.. 'ఫోకల్' పోస్టింగులు

ఈ అవినీతి తిమింగలాలకు వెన్నుముకగా నిలుస్తోంది రాజకీయ వ్యవస్థే. ఎక్కువ లూటీకి అవకాశం ఉండే 'ఫోకల్' పోస్టింగులను దక్కించుకోవడం కోసం కొందరు అధికారులు పొలిటికల్ లీడర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ పోస్టింగుల బదిలీల వెనుక తెరవెనుక కోట్లతో బేరసారాలు సాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పెట్టుబడి పెట్టి మరీ క్రీమీ లేయర్ సీట్లను దక్కించుకుంటున్నారంటేనే వీరు ఏ స్థాయిలో వసూళ్లకు పాల్పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

### దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి

ప్రభుత్వాలు ఎప్పుడు మారతాయో, బదిలీల ముప్పు ఎప్పుడు వస్తుందో తెలియని తరుణంలో అధికారులు 'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అనే సామెతను తూచా తప్పకుండా పాటిస్తున్నారు. ఒకవేళ తమపై అవినీతి ఆరోపణలు వచ్చినా, బదిలీల ముప్పు పొంచి ఉన్నా.. తమ పొలిటికల్ గాడ్‌ఫాదర్లను రక్షణ కవచంగా వాడుకుంటున్నారు. రాజకీయ నేతలకు నెలవారీ మామూళ్లు (వాటాలు) అందుతుండటంతో వారు కూడా ఈ అధికారుల సీట్ ఊడకుండా పూర్తి అండగా నిలుస్తున్నారు.

### ఉన్నతాధికారులకు తెలియకుండా రహస్య సెటిల్‌మెంట్లు

ఈ అక్రమార్కుల దందా ఏ స్థాయిలో ఉందంటే.. తమ సొంత శాఖల్లోని ఉన్నతాధికారులకు సైతం కనీస సమాచారం లేకుండా రహస్యంగా వ్యవహారాలు నడిపిస్తున్నారు. కార్యాలయాల్లోనే ఒక సమాంతర దందాను సాగిస్తూ.. భూ వివాదాలు, పెద్ద పెద్ద ప్రాజెక్టుల అనుమతులు, కాంట్రాక్టుల మంజూరు వంటి కీలక ఫైళ్లను టేబుల్ కిందనే సెటిల్ చేస్తున్నారు.

### 'బినామీ'ల పేరిట విల్లాలు.. రియల్ ఎస్టేట్‌లోకి డైవర్షన్

లంచాల రూపంలో వస్తున్న నల్లధనాన్ని దాచేందుకు వీరు పక్కా స్కెచ్ వేస్తున్నారు. తమ డ్రైవర్లు, వంటమనుషులు, నమ్మకస్థులైన బినామీల పేరిట విలాసవంతమైన విల్లాలు, ఫామ్‌హౌస్‌లు, వందల ఎకరాల వ్యవసాయ భూములను కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం లంచాల సొమ్మంతా రియల్ ఎస్టేట్ రంగంలోకి భారీగా డైవర్ట్ అవుతోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న కమర్షియల్ కాంప్లెక్స్‌లు, ఐటీ కారిడార్‌లోని ల్యాండ్స్ వెనుక ఇలాంటి అధికారుల పెట్టుబడులే చాలా ఉన్నట్లు సమాచారం.

### ఏసీబీ ఆకస్మిక తనిఖీలతో బట్టబయలు

'పాపం పండక మానదు' అన్నట్లుగా అవినీతి నిరోధక శాఖ రంగంలోకి దిగడంతో వీరి అక్రమ సామ్రాజ్యాల పునాదులు కదులుతున్నాయి. గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఏసీబీ అధికారులు జరుపుతున్న ఆకస్మిక తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగుచూస్తున్నాయి. లాకర్లు తెరిస్తే కిలోల కొద్దీ బంగారం, లగ్జరీ కార్ల కీలు, వందల కోట్ల విలువైన ఆస్తి పత్రాలు బయటపడుతున్నాయి. అవినీతి తిమింగలాల మూలాలను కదిలించేలా ఏసీబీ దూకుడు పెంచింది.

### వ్యవస్థ ప్రక్షాళన చేస్తేనే భవిష్యత్తు

సంచలనంగా మారిన కొందరు అధికారుల అవినీతి వ్యవహారంపై సమాజంలో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కేవలం దాడులు చేసి సస్పెండ్ చేయడం మాత్రమే సరిపోదని, వ్యవస్థలో సమూల మార్పులు రావాలని మేధావులు, సామాజిక విశ్లేషకులు డిమాండ్ చేస్తున్నారు. ఏసీబీ దాడులలో దొరికిన సొమ్ము పూర్తిగా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కీలక పోస్టింగుల్లో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని, బినామీ చట్టాలను మరింత కఠినతరం చేసి, లంచగొండుల ఆస్తులను ప్రభుత్వమే పూర్తిగా స్వాధీనం చేసుకున్నప్పుడే ఈ వ్యవస్థ ప్రక్షాళన సాధ్యమవుతుందని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

## ఉప్పల్ నారాయణ స్కూల్లో పుస్తకాల అమ్మకాలను సీజ్ చేసిన ఎంఈఓ



నాచారం (ప్రశ్న న్యూస్) ఉప్పల్ లో ఉన్న నారాయణ స్కూల్ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టం వచ్చినట్టు విద్యార్థుల దగ్గర నుండి కేవలం బుక్స్ ఫీజు లే 15000, వేల రూపాయిలు కట్టించుకొని వాలా రక్తం తాగుతున్న నారాయణ గ్రూప్ అఫ్ స్కూల్స్ శనివారం నాడు నారాయణ స్కూల్ లో బుక్స్ అమ్ముతుండంగా రెడ్ హ్యాండ్ గా పట్టుకొని. ఉప్పల్ మండల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కి పట్టించి బుక్స్ సిజ్ చేపించి లాక్ వేపించారు. దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇటీకాల గణేష్ ఇతర విద్యార్థి సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేదాకా

# కదిలేది లేదు

### – కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసే వరకు జంతర్ మంతర్ నుంచి కదిలే ప్రసక్తి లేదని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. నీట్-యూజీ 2026 పరీక్షలో చోటుచేసుకున్న అవకతవకలు, పేపర్ లీకేజీలకు నిరసనగా ఆయన ఈ ఆందోళన చేపట్టారు. పోలీసుల అనుమతి గడువు ముగిసినప్పటికీ, ఆయన తన నిరసనను కొనసాగిస్తుండటం గమనార్హం. ఈ ఆందోళనలో విద్యార్థులు, మద్దతుదారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నిరసనకారులు ప్లేట్లు, స్పూన్లతో శబ్దం చేస్తూ వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తమ శాంతియుత నిరసనను కొనసాగించేందుకు అనుమతిని పొడిగించాలని దీప్కే అధికారులను కోరారు. విద్యావ్యవస్థలో జరుగుతున్న వరుస తప్పిదాల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతున్నా, ధర్మేంద్ర ప్రధాన్ ఇంకా పదవిలో కొనసాగడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. శనివారం సాయంత్రంతో నిరసన గడువు ముగియడంతో పోలీసులు జంతర్ మంతర్‌ను ఖాళీ చేయించేందుకు ప్రయత్నించారు. అయితే, తమ ఆందోళనను శాంతియుత మార్గంలోనే కొనసాగిస్తామని దీప్కేతో పాటు ఆయన మద్దతుదారులు స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చకపోతే, దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని సీజేపీ హెచ్చరించింది. మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ కావడంతో, మే 12న ఆ పరీక్షను అధికారులు రద్దు చేశారు. తిరిగి ఈ పరీక్షను జూన్ 21న నిర్వహించనున్నారు. ఈ గందరగోళం కారణంగా దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారు. పరీక్ష రద్దు, అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం విచారకరం.

# బ్యాంక్ లాకర్లలోనూ నోట్ల కట్టలే

- మరో కోటిన్నర స్వాధీనం, నరహరి లెక్క తేలట్లేదు
- ఒక్క అధికారి దగ్గరే ఇంత ఉందంటే మిగతా వాళ్ళ సంగతి ఏంటి.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో అవినీతి తిమింగలాల వేటను తెలంగాణ అవినీతి నిరోధక శాఖ మరింత ముమ్మరం చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ల్యాండ్స్ అండ్ సర్వే శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి రావుకు సంబంధించిన ఆర్థిక సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో సహా లాగే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కొన్ని రోజుల క్రితమే ఆయన నివాసాలు, బంధువుల ఇళ్లపై ఏకకాలంలో దాడులు చేసి కోట్ల విలువైన ఆస్తులను గుర్తించిన ఏసీబీ బృందాలు తాజాగా ఆయన భార్య పేరిట ఉన్న బ్యాంకు లాకర్లను ఓపెన్ చేయడంతో నోట్ల కట్టల గుట్టలు బయటపడ్డాయి.

### శాలిబండ కెనరా బ్యాంక్ లాకర్‌లో నోట్ల కట్టలు

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఇప్పటికే అరెస్ట్ అయి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న సుంకరి నరహరి రావు కేసు దర్యాప్తులో భాగంగా శనివారం ఏసీబీ అధికారులు కీలక అడుగు వేశారు. హైదరాబాద్ పాతబస్తీ శాలిబండలోని కెనరా బ్యాంక్ బ్రాంచ్‌లో నరహరి రావు భార్య పేరిట ఉన్న ఒక బ్యాంకు లాకర్‌ను అధికారులు తెరిచారు. ఆ లాకర్‌ను తనిఖీ చేయగా అధికారులకు దిమ్మతిరిగేలా ఏకంగా రూ. 1.50 కోట్ల అదనపు నగదు లభ్యమైంది. ఈ నోట్ల కట్టలను స్వాధీనం చేసుకున్న అధికారులు, వీటిపై పంచనామా నిర్వహించారు.

### ఇంకా తెరవాల్సిన లాకర్లు రెండు.. నిగూఢంగా మరిన్ని రహస్యాలు

నరహరి రావు అవినీతి నెట్‌వర్క్ కేవలం ఈ ఒక్క లాకర్‌తోనే ముగిసిపోలేదు. దర్యాప్తులో భాగంగా ఆయన , ఆయన కుటుంబ సభ్యుల పేరిట మరికొన్ని బ్యాంకుల్లో ఖాతాలు, లాకర్లు ఉన్నట్లు ఏసీబీ సైబర్ ఫైనాన్షియల్ వింగ్ గుర్తించింది. అధికారులు వెల్లడించిన సమాచారం ప్రకారం.. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఇంకా మరో రెండు కీలకమైన బ్యాంకు లాకర్లను ఓపెన్ చేసి తనిఖీ చేయాల్సి ఉంది. ఆ మిగిలిన రెండు లాకర్లలో కూడా భారీగా నగదు లేదా బంగారు ఆభరణాలు, బినామీ ఆస్తి పత్రాలు ఉండే అవకాశం ఉందని అధికారులు గట్టిగా అనుమానిస్తున్నారు.

### ఇంట్లోని అటకపై 1.54 కోట్లు.. డాక్యుమెంట్ల విలువ రూ. 13 కోట్లు!

కొన్ని రోజుల క్రితం నరహరి రావు నివాసం, కార్యాలయాలతో పాటు ఆయన బంధువులు, బినామీలకు చెందిన 10కి పైగా ప్రాంతాల్లో ఏసీబీ ఏకకాలంలో దాడులు జరిపిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఆయన నివాసంలోని అటకపై బ్యాగుల్లో దాచి ఉంచిన రూ. 1.54 కోట్ల నగదును అధికారులు సీజ్ చేశారు. ప్రాథమిక సోదాల్లోనే రూ. 2.29 కోట్ల బ్యాంక్ బ్యాలెన్స్, రూ. 5.04 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, 1.3 కిలోల బంగారు ఆభరణాలు, మరియు 8 కిలోల వెండి వస్తువులను ఏసీబీ స్వాధీనం చేసుకుంది. వీటితో పాటు ఒక విలాసవంతమైన కియా కారెన్స్ కారును కూడా సీజ్ చేశారు.

### గచ్చిబౌలి, నార్సింగిల్లో హైరైజ్ ఫ్లాట్లు.. మార్కెట్ విలువ వంద కోట్లు

నరహరి రావు కూడబెట్టిన స్థిరాస్తుల లిస్ట్ చూసి ఏసీబీ అధికారులే అవాక్కయ్యారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో 1.24 ఎకరాల వ్యవసాయ భూమి, గచ్చిబౌలి టీఎన్జీఓస్ కాలనీలో ఒక జీ౦3 భవనం, చత్రినాకలో జీ౦2 ఇల్లు ఉన్నాయి. ఇవి కాకుండా ఐటీ కారిడార్ పరిధిలోని పుప్పాలగూడలో 2,500 చదరపు అడుగుల భారీ ఫ్లాట్, నార్సింగిలో రెండేసి చొప్పున 1,860 చదరపు అడుగుల హైరైజ్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్లు, రాజేంద్రనగర్‌లో మరో ఫ్లాట్ ఉన్నట్లు దక్యుమెంట్లు లభించాయి. డాక్యుమెంట్ల ప్రకారం వీటి విలువ రూ. 13.05 కోట్లుగా చూపించినప్పటికీ ప్రస్తుతం మార్కెట్ రేట్ల ప్రకారం వీటి విలువ రూ. 100 కోట్లకు పైమాటేనని అంచనా.



### సర్వీసు ముసుగులో భారీగా అక్రమాలు.. లోతైన విచారణ

తన సుదీర్ఘ ప్రభుత్వ సర్వీసులో ల్యాండ్ రికార్డులు, సర్వే నిబంధనలను అడ్డం పెట్టుకుని, అనేక అక్రమ మార్గాల్లో నరహరి రావు కోట్ల రూపాయల లంచాలు వసూలు చేసినట్లు ఏసీబీకి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలోనే ఆయనపై నిఘా పెట్టి అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం ఆయన రిమాండ్‌లో ఉండగా, మిగిలిన లాకర్ల నుంచి వచ్చే సమాచారం ఆధారంగా బినామీల లిస్టును మరింతగా విస్తరించి, అక్రమంగా సంపాదించిన ప్రతి పైసాను అటాచ్ చేసేందుకు ఏసీబీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588